
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వరంగల్
శుక్రవారం 1 మార్చి 2024



ఎదురుదాడే లక్ష్యం!

బీఆర్ఎస్ మేడిగడ్డ పర్యటన ఆంతర్యమిదే..

- కాంగ్రెస్ ప్రచారాన్ని తిప్పికొట్టేలా కార్యాచరణ
- నేటి కేటీఆర్ బృందం పర్యటనపై సర్వత్రా ఆసక్తి
- 39 మంది ఎమ్మెల్యేలతోపాటు పలువురు ఎమ్మెల్సీలు, ఎంపీల రాక

భూపాలపల్లి (ఆంధ్రజ్యోతి) / మహదేవపూర్ రూరల్, ఫిబ్రవరి 29 : కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన మేడిగడ్డ ప్రాజెక్టు లోపభూయిష్టమని కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధపు ప్రచారం చేస్తోందని మండిపడుతున్న బీఆర్ఎస్ నేతలు ఎదురుదాడే లక్ష్యంగా వ్యూహరచన చేస్తున్నారు. సీఎం, మంత్రులు సహా కాంగ్రెస్ నేతల మాటలను తిప్పి కొట్టడమే లక్ష్యంగా భారత రాష్ట్ర సమితి ఎదురుదాడి వ్యూహానికి పదును పెడుతోంది. ఇటీవల కాంగ్రెస్ మంత్రులు ఎమ్మెల్యేల బృందం మేడిగడ్డ పర్యటించి గత ప్రభుత్వ ప్రాజెక్టుల నిర్మాణంలో చోటుచేసుకున్న లోపాలను.. నిర్మాణాల్లో చోటు చేసుకున్న అక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆత్మరక్షణలో పడిన బీఆర్ఎస్ నేతలు ఎన్నికల ముందు డ్యామేజ్ కంట్రోల్ కోసం పోటీ యాత్రలకు శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలోనే పార్టీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు కల్వకుంట్ల తారక రామారావు నేతృత్వంలో సుమారు 39 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో పాటు పలువురు ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధుల బృందం శుక్రవారం మేడిగడ్డ బ్యారేజ్‌ను సందర్శించి వాస్తవాలను చెప్పే ప్రయత్నం చేస్తామంటోంది. ప్రభుత్వం మారిన నాటి నుంచే మేడిగడ్డ ప్రాజెక్టుపై బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల మధ్య యుద్ధం మొదలవగా ప్రాజెక్టులో దెబ్బతిన్న 19, 20, 21 పిల్లర్లను మరమ్మతు చేసే అవకాశం ఉన్నా ప్రభుత్వం పంతానికి పోయి ప్రాజెక్టును నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తోందన్నది గులాబీ నేతల వాదన. పార్లమెంట్ ఎన్నికల ముందు ప్రాజెక్టు వ్యవహారంపై కాంగ్రెస్ నేతలు గత ప్రభుత్వంపై విమర్శలను తీవ్రతరం చేస్తూ ఉండడంతో బీఆర్ఎస్ ఎదురుదాడి చేయడం ద్వారానే కాంగ్రెస్ ప్రచారాలను తిప్పి కొట్టాలన్న అజెండాతో కార్యచరణ సిద్ధం చేసుకున్నట్లు రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. దీంతో ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాలలో మేడిగడ్డ ప్రాజెక్టు వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. ప్రాజెక్టు భద్రతపై డ్యామ్ సేఫ్టీ నిపుణుల బృందం ప్రభుత్వానికి నివేదిక ఇచ్చిన నేపథ్యంలో కేటీఆర్ బృందం చేపడుతున్న మేడిగడ్డ పర్యటన రాజకీయంగా అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. శుక్రవారం ఉదయం 8.30గంటలకు హైదరబాద్ నుంచి బయలుదేరనున్న బీఆర్ఎస్ బృందం మధ్యాహ్నం 12గంటలకు భూపాలపల్లికి చేరుకోనుంది. మధ్యాహ్న భోజనం అనంతరం 2గంటలకు మేడిగడ్డ బ్యారేజీకి చేరుకుంటారు. సుమారు గంటపాటు పరిశీలన అనంతరం మధ్యాహ్నం 3గంటలకు అన్నారం బ్యారేజీ చేరుకొని కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల ప్రయోజనాలు, కాంగ్రెస్ చేస్తున్న ప్రచారాల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేసి.. మీడియాతో మాట్లాడనున్నారు.

పర్యటనపై సర్వత్రా ఆసక్తి..

శుక్రవారం బీఆర్ఎస్ నేతల మేడిగడ్డ ప్రాజెక్టు యాత్రపై సర్వత్రా ఆసక్తి కనిపిస్తోంది. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యేల బృందం మేడిగడ్డ ప్రాజెక్టు లోపాలు, భద్రత, జరిగిన అవినీతిపై సాక్ష్యాలతో మీడియాకు వెల్లడించిన నేపథ్యంలో దానికి కౌంటర్‌గా శుక్రవారం కేటీఆర్ బృందం ఏం చెప్పబోతోందన్నది అందరిలోనూ ఉత్కంఠ రేపుతోంది. మేడిగడ్డ ప్రాజెక్టుకు ఏర్పడిన పగుళ్లకు సంబంధించి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను లక్ష్యంగా చేస్తూ కాంగ్రెస్ చేస్తున్న విమర్శల దాడిని కేటీఆర్ నేడు ఎలా తిప్పుకొట్టబోతున్నారన్నదానిపై చర్చ జరుగుతోంది. అయితే గులాబీ నేతల ప్రాజెక్టు సందర్శన కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ నిశితంగా గమనిస్తుందని అంటున్నారు. పార్లమెంట్ ఎన్నికలకు గడువు దగ్గర పడడంతో రెండు పార్టీల మధ్య ప్రాజెక్టులపై విమర్శల యుద్ధం పతాక స్థాయికి చేరింది. ఈ పరిస్థితుల్లో తెలంగాణ పార్లమెంట్ ఎన్నికల రాజకీయమంతా కాళేశ్వరం ప్రాజెక్టు చుట్టే కొనసాగే పరిస్థితి కనిపిస్తుండడంతో ఈ పోటాపోటీ పర్యటనలు రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేపుతున్నాయి. ఈ నేపథ్యంలో చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలను గురువారం సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా బాల్క సుమన్ మాట్లాడుతూ మేడిగడ్డ బ్యారేజీలో ఒక్క పిల్లర్ కుంగిపోతే అసలు కాళేశ్వరం ప్రాజెక్టే పనికిరాకుండా పోయిందని కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తోందని కాంగ్రెస్ కుట్రలను తిప్పికొట్టేందుకే కేటీఆర్ బృందం మేడిగడ్డ బ్యారేజీని సందర్శించనుందని తెలిపారు. తెలంగాణకు వరప్రదాయిని అయిన కాళేశ్వరం ప్రాజెక్టులోని భాగమైన మేడిగడ్డ బ్యారేజీకి మరమ్మతులు చేపట్టకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయం చేస్తోందని దుయ్యబట్టారు ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు గెల్లు శ్రీనివాస్, వాసుదేవరెడ్డి, పార్టీ మహదేవపూర్ మండల అధ్యక్షుడు లింగంపెల్లి శ్రీనివాస్‌రావు, నాయకులు శ్రీపతి బాపు, అలీంఖాన్, తదితరులు ఉన్నారు.



మేడిగడ్డ బ్యారేజీ వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న పుట్ట మధు, బాల్క సుమన్


ఎమ్మెల్యే కడియం నివాసంలో బీఆర్ఎస్ నేతల భేటీ

- ఏర్పాట్లు, విజయవంతంపై చర్చ

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 29 : కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ విషప్రచారం చేస్తోందంటున్న బీఆర్ఎస్.. కాంగ్రెస్ ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు ప్రాజెక్టు సందర్శన చేపట్టింది. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, నేతలు తరలిరానుండగా.. ఈ కార్యక్రమ విజయవంతానికి ఉమ్మడి వరంగల్ నేతలు ఏర్పాట్లు చేశారు. దీనిపై గురువారం జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హనుమకొండలోని తన నివాసంలో ఉమ్మడి జిల్లా నేతలు.. శాసన మండలి డిప్యూటీ ఛైర్మన్ బండా ప్రకాశ్, వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేశ్, నేతలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, చల్లా ధర్మారెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి తదితరులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కడియం మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు సమగ్ర స్వరూపాన్ని ప్రజలకు అర్థమయ్యేలా చూపుతామని, ప్రాజెక్టును రాజకీయం కోసం వాడుకుంటున్న కాంగ్రెస్ బండారం బయట పెడతామన్నారు. కాగా, హైదరాబాద్ నుంచి బస్సులో వస్తున్న కేటీఆర్‌ను వరంగల్ నేతలు జనగామ సమీపంలో నెల్లుట్ల వద్ద ఉదయం 10 గంటలకు స్వాగతం పలికి ర్యాలీగా మేడిగడ్డకు బయలుదేరి వెళ్లనున్నారు. ఈ పర్యటనకు ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలు తరలనున్నారు.



కడియం నివాసంలో భేటీ అయిన నేతలు



మెగా డీఎస్సీతో ఉమ్మడి జిల్లాలో భర్తీ కానున్న 1,519 పోస్టులు

- మిగిలిన ఖాళీలనూ భర్తీ చేయాలంటున్న అభ్యర్థులు
- ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన ఎంపికలు చేయాలని డిమాండ్

వరంగల్ సిటీ, ఫిబ్రవరి 29: ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ఎన్నో ఏళ్లుగా వేచి చూస్తున్న అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. 11,062 పోస్టులతో మెగా డీఎస్సీకి ముఖ్యమంత్రి గురువారం నోటిఫికేషన్ జారీ చేయడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయ ఉద్యోగార్థుల్లో ఉత్సాహం కనిపిస్తోంది. ప్రభుత్వం వెల్లడించిన నోటిఫికేషన్ ప్రకారం ఉమ్మడి జిల్లాలోని వరంగల్, హనుమకొండ, జనగామ, ములుగు, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో మొత్తం 1,519 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ కానున్నాయి. మరోసారి టెట్ నోటిఫికేషన్ వేసిన తర్వాత డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తే బాగుండేదని కొంత మంది బీఈడీ, డీఈడీ అభ్యర్థులు వారి అభిప్రాయాలు వ్యక్తం చేస్తుంటే, ఎంతో కాలంగా విద్యాశాఖలో పని చేస్తున్న ఇంక్లూసివ్ రీసోర్స్ పర్సన్స్(ఐఆర్పీ)లకు డీఎస్సీలో వెయిటేజీ మార్కులు కేటాయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇక డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసిన ప్రభుత్వం కాలయాపన చేయకుండా త్వరితగతిన భర్తీల ప్రక్రియను పూర్తి చేసి వచ్చే విద్యా సంవత్సరాన్ని నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులతో విద్యా సంవత్సరాన్ని ప్రారంభించాలని కోరుతున్నారు. అయితే రాష్ట్ర వ్యాప్తంగా 25 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలు ఉండగా ప్రభుత్వం 11,062 పోస్టులను మాత్రమే భర్తీ చేయనుండటంతో అభ్యర్థులు ఒకింత అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

చాలా సంవత్సరాల తర్వాత..

2012లో అప్పటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసింది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత మెగా డీఎస్సీ కోసం అభ్యర్థులు ఎదురు చూడగా.. 2017లో బీఆర్ఎస్ ప్రభుత్వం టీఆర్టీ ద్వారా స్వల్ప సంఖ్యలో ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశారు. అనంతరం గత సంవత్సరం 2023లో గత ప్రభుత్వం 5 వేల పైచిలుకు పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసింది. ఆ తర్వాత ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో అప్పటి డీఎస్సీ నోటిఫికేషన్ భవితవ్యం మరుగున పడింది. కాగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు మరో 6 వేల ఖాళీలను కలుపుతూ మొత్తం 11,062 పోస్టులకు మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను జారీ చేసింది.

ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన ఎంపిక చేయాలి...

ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్‌ను జారీచేయడాన్ని ఉద్యోగార్థులతో పాటు ఉపాధ్యాయ సంఘాల నేతలు హర్షిస్తున్నారు. అయితే పూర్తి స్థాయిలో మార్గదర్శకాలు విడుదల కాకపోవడంతో కొంత గందరగోళంలో ఉన్నారు. జోన్ల వారీగా కాకుండా ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన డీఎస్సీ ఎంపికలు

మిగతా 7వ పేజీలో..

ప్రావీణ్యకు బల్దియా బాధ్యతలు

- ఇన్‌చార్జ్ కమిషనర్‌గా వరంగల్ కలెక్టర్



బాధ్యతలు చేపడుతున్న ప్రావీణ్య

జీడబ్ల్యూఎంసీ (హనుమకొండ సిటీ), ఫిబ్రవరి 29 : వరంగల్ కలెక్టర్ ప్రావీణ్యకు వరంగల్ మహా నగర పాలక సంస్థ కమిషనర్ (ఎఫ్ ఏసీ)గా బాధ్యతలను అప్పగించారు. ఈ మేరకు ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. బల్దియా కమిషనర్‌గా ఉన్న షేక్ రిజ్వాన్ బాషా జనగామ జిల్లా కలెక్టర్‌గా వెళ్లిన సంగతి విదితమే. పూర్తిస్థాయిలో కమిషనర్ నియమితులవుతారని భావించినా ఆ మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేదు. ఈ క్రమంలో వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. గతంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్‌గా పని చేసిన ప్రావీణ్య వరంగల్ కలెక్టర్‌గా పదోన్నతిపై వెళ్లారు. ప్రస్తుతం ప్రావీణ్యకే అదనపు బాధ్యతలను కేటాయించింది.



కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు

మేడారం హుండీల లెక్కింపు

ప్రారంభం

- పది రోజుల పాటు కొనసాగనున్న ప్రక్రియ
- ప్రక్రియలో 350మంది సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు
- పోలీసు బందోబస్తు, సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు
- అంబేద్కర్ బొమ్మ ఉన్న నకిలీ నోట్లు ప్రత్యక్షం
- తొలిరోజు రూ.3.15 కోట్లకుపైగా ఆదాయం రాక

7

పోలింగ్ శాతం పెంచాలి: కలెక్టర్

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 29: ఎన్నికల్లో పోలింగ్ శాతం పెరిగేలా యువతకు క్యాంపస్ అంబాసిండర్లు అవగాహన కల్పించాలని కలెక్టర్ పి. ప్రావీణ్య కోరారు. ఓటరు అవగాహన కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల నమోదుపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని, క్యాంపస్ అంబాసిండర్‌గా గుర్తించిన విద్యార్థులతో అవగాహన కార్యక్రమంలో సమర్థవంతంగా ఓటర్లలో చైతన్యం కల్పించుటకు పలు సూచనలు చేశారు. కళాశాలల్లో బృందాలుగా ఏర్పడి అర్హులైన ప్రతీ ఒక్కరికి ఓటరు అవగాహనతోపాటు 18సంవత్సరాలు పూర్తయిన యువతకు ఓటరు గుర్తింపు కార్డు నమోదు చేయనట్లయితే ఫాం-6 ద్వారా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. కాలేజీ పరిసరాల ప్రాంతాలతోపాటు విద్యార్థులు ఎక్కువగా సంచరించే బస్‌స్టేషన్, రైల్వే స్టేషన్, మార్కెట్, షాపింగ్ మాల్ తదితర ప్రాంతాల్లో వినూత్న కార్యక్రమాల ద్వారా ఓటర్లలో అవగాహన కల్పించాలని వెల్లడించారు. సమావేశంలో నోడల్ అధికారి భాగ్యలక్ష్మీ, పరిశ్రమల శాఖ అధికారి నర్సింహమూర్తి, పశుసంవర్ధక శాఖ అధికారి బాలకృష్ణ, సైన్స్ అధికారి శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి..

జిల్లాలో 15 ఏళ్ల పైబడిన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. త్వరలో ప్రారంభం కానున్న న్యూ ఇండియా లిటరసీ కార్యక్రమం ప్రారంభంపై గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అక్షరాస్యతను పెంపొందించడం క్రిటికల్ లైఫ్ స్కిల్స్ వృత్తి నైపుణ్యాలను అభివృద్ధి పర్చడం, ప్రాథమిక విద్యా చదువు కొనసాగించేలా చూడటం వంటి ఐదు ప్రధానాంశాలను ప్రామాణికంగా తీసుకొని జిల్లాలో ఇంటింటికి సర్వే నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సర్వేలో 15 సంవత్సరాలకు పైబడిన వారిని 19,808 మందిని గుర్తించడం జరిగిందని యూ డైస్ యాప్ ద్వారా వారి వివరాలు నమోదు చేసి ఆన్‌లైన్ ద్వారా బోధన తరగతులు నిర్వహించి అనంతరం పరీక్షలు నిర్వహించి అందులో ఉత్తీర్ణులైన వారిని అక్షరాస్యులుగా గుర్తించి సర్టిఫికెట్ అందజేయబడుతుందన్నారు. కార్యక్రమంలో డీఈవో వాసంతి, డీఆర్‌డీవో పీడీ కౌసల్యాదేవి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఎం.శారద, ఇతర శాఖల అధికారులు సౌజన్య, పుష్పలత, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య



ఆంధ్రబాలిక కళాశాలలో పరీక్ష తీరును పరిశీలిస్తున్న డీఐఈవో మాధవరావు

ఇంటర్ సెకండ్ ఇయర్ పరీక్షలు షురూ..

తొలిరోజు 239మంది గైర్హాజరు

వరంగల్ సిటీ, ఫిబ్రవరి 29: జిల్లాలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు 96 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం 6,165 మందికిగాను 5,924 మంది హాజరుకాగా, 239 మంది గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 5,015కు గాను 4,834 మంది, వొకేషనల్ విభాగంలో 1,150 మందికిగాను 1,090 మంది హాజరు కాగా జనరల్ విభాగంలో 179 మంది, వొకేషనల్ విభాగంలో 60 మంది గైర్హాజరయ్యారు. పరీక్షల్లో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్లు డీఐఈవో కాక మాధవరావు తెలిపారు. ఆయన నగరంలోని ఆంధ్ర బాలిక కళాశాల, కృష్ణకాలనీ ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఏవీవీ జూనియర్ కళాశాల, రంగశాయిపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

అందివచ్చిన ‘ఆయుర్వేదం’

- ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రికి టి-డయాగ్నస్టిక్ సేవలు
- అందుబాటులోకి వచ్చిన అన్ని రకాల ఉచిత ల్యాబ్ పరీక్షలు
- వరంగల్ ఆయుర్వేద ఆస్పత్రిలో మెరుగైన వైద్యం
- ఆనందం వ్యక్తం చేస్తున్న రోగులు, వారి బంధువులు



7

ఆర్‌టీఏ అధికారుల స్పెషల్ డ్రైవ్

పేరుకుపోయిన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు, డ్రైవింగ్ లైసెన్స్‌ల పంపిణీ



కాశోజీ జంక్షన్, ఫిబ్రవరి 29 : మోటారు వాహనదారులు తీసుకోకుండా కార్యాలయంలో పేరుకుపోయిన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు, డ్రైవింగ్ లైసెన్స్‌ల పంపిణీకి ఆర్‌టీఏ అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఇటీవల హనుమకొండ డిప్యూటీ ట్రాన్స్‌ఫోర్ట్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన పుప్పాల శ్రీనివాస్, వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే వాహనదారులకు సత్వర సేవలు అందించేందుకు చర్యలు చేపట్టారు.

వాహనదారులకు పంపిణీ కాకుండా కార్యాలయంలో కుప్పలు తెప్పలుగా పడి ఉన్న సర్టిఫికెట్లను గమనించిన ఆయన వెంటనే వాహనదారులకు వాటిని చేర్చేందుకు చర్యలకు ఉపక్రమించారు. సర్టిఫికెట్లను పరిశీలించగా అవి పోస్టులో వెళ్లి అడ్రస్‌దారులు అక్కడ నివసించడం లేదని వాపస్ వచ్చిన సుమారు 4 వేలకు పైగా సర్టిఫికెట్లు కనుగొన్నారు. ఆ సర్టిఫికెట్లను ప్రత్యేక కార్యక్రమం ద్వారా వారికి అందజేయాలని తలపెట్టారు. మార్చి 1 నుంచి నెలాఖరు వరకు సంబంధిత సర్టిఫికెట్ దారులు మధ్యాహ్నం 2 గంటల తర్వాత కార్యాలయానికి వస్తే ప్రత్యేక కౌంటర్ ద్వారా పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టారు. అయితే సర్టిఫికెట్ కోసం వచ్చే వాహనదారులు స్వయంగా తమ ఆధార్‌కార్డును లేదా తామందించిన ఒరిజినల్ రిసీప్ట్‌ను పట్టుకొని రావాలని డీటీసీ శ్రీనివాస్ కోరారు. కార్యాలయంలో ప్రస్తుతం వాహనాలు రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి, డ్రైవింగ్ లైసెన్స్‌లు అర్హత సాధించిన వారికి స్పీడ్ పోస్టు ద్వారా మూడు లేదా నాలుగు రోజుల్లోపు వారి అడ్రస్‌కు చేరేలా చర్యలు చేపట్టారు.

ప్రజా భద్రతా చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలి

అమరుల బంధు మిత్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు అంజమ్మ - రేపు అంబేద్కర్ భవన్‌లో ఉమ్మడి జిల్లా స్థాయి సదస్సు

వడ్డేపల్లి, ఫిబ్రవరి 29: తెలంగాణలో ప్రజా భద్రతా చట్టాన్ని ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని అమరుల బంధుమిత్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు అంజమ్మ, ప్రధాన కార్యదర్శి పద్మకుమారి డిమాండ్ చేశారు. బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారితో పాటు ఉపాధ్యక్షురాలు శాంత మాట్లాడారు. విప్లవ రాజకీయాల మీద నిషేధాన్ని ప్రజాస్వామ్యం అంగీకరించదని అన్నారు. గత ప్రభుత్వాలు చేసిన అప్రజాస్వామిక విధానాల మీద తమ వైఖరి ఏమిటో సీఎం రేవం త్‌రెడ్డి చెప్పాలని అన్నారు. విప్లవోద్యమం మీద నిషేధానికి, అక్రమ కేసులకు, ఎన్‌ఐఏ దాడులకు వ్యతిరేకంగా మార్చి 2న ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో నిర్వహించే ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి సదస్సులో ప్రజాస్వామిక వాదులు, మేధావులు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

సమావేశంలో జాయింట్ సెక్రటరీ భవాని, పౌరహక్కుల సంఘం నేతలు పాణి, కళమ్మ, జయంత్, శోభ, విరసం కుమార్ పాల్గొన్నారు.

కేయూ ఆర్ట్స్ డీన్‌గా ప్రొఫెసర్ ఏటూరి జ్యోతి



కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 29: కాకతీయ యూనివర్సిటీ ఆర్ట్స్ విభాగం కొత్త డీన్‌గా, కేయూ తెలుగు విభాగం సీనియర్ ప్రొఫెసర్ గా ఏటూరి జ్యోతి నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి. మల్లారెడ్డి ఉత్తర్వులు వెలువరించారు. ఇప్పటి వరకు డీన్‌గా పనిచేసిన ప్రొఫెసర్ బన్న ఐలయ్య ఉద్యోగ విరమణ పొందడంతో డీన్‌గా ప్రొఫెసర్ ఏటూరి జ్యోతి బాధ్యతలు స్వీకరించారు. 2007లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమితులైన జ్యోతి తెలుగు విభాగాధిపతిగా, బీవోఎస్ స్టడీ ఛైర్‌పర్సన్‌గా, ఎస్సీ, ఎస్టీ సెల్, మహిళ అధ్యయన కేంద్రం డైరెక్టర్‌గా, జండర్ స్టడీస్ విభాగం ఇన్‌చార్జిగా , వర్సిటీ కేంద్ర గ్రంథాలయ మెంబర్ ఇన్‌చార్జిగా పనిచేశారు.

ఈ సందర్భంగా పలువురు ప్రొఫెసర్లు, పరిపాలన అధికారులు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యా ర్థులు కొత్త డీన్, విభాగాధిపతి ప్రొఫెసర్ ఏటూరి జ్యోతికి అభినందనలు, శుభకాంక్షలు తెలిపారు

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న యాదనాయక్

హనుమకొండ, ఫిబ్రవరి 29: వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న 104 మంది ఉద్యోగులకు సంబంధించిన ఐదు నెలల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని, ఇతర అన్ని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మార్చి 1వ తేదీన తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టనున్నట్లు యూనియన్ రాష్ట్ర కార్య దర్శి యాదనాయక్ తెలిపారు. గురు వారం యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద ఉదయం 10 గంటలకు మహాధర్నా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గడప గడపకు ఉచిత వైద్యం పేరుతో గత 15 సంవత్సరాలుగా పని చేస్తున్న ఉద్యోగులకు ఐదు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంబాలు గడవడం కష్టంగా మారిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని వేతనాలు చెల్లించడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. మహాధర్నాకు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పి.శ్రీనివాస్, సిహెచ్.అనిల్ కుమార్, ఎం.రాజుగౌడ్, కె.మధుసూదన్, బి.బుచ్చిరాజు, జి.సాయిబాబా, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

గణిత ఫోరం రాష్ట్ర ఈసీ మెంబర్‌గా సురేష్



వరంగల్ సిటీ, ఫిబ్రవరి 29: తెలంగాణ గణిత ఫోరం రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా కందకట్ల సురేష్ నియామకం అయ్యారు. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన ఫోరం ఎన్నికల్లో సురేష్‌ను మొదటి ఈసీ మెంబర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాగా సురేష్ హనుమకొండ జిల్లాలోని వడ్డేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నాడు.

ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ జ్యోతి

వైస్ ప్రిన్సిపాల్‌గా పుల్లా రమేశ్



నూతన పరిపాలన అధికారులతో వీసీ రమేశ్

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 29: సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల కొత్త ప్రిన్సిపాల్‌గా కేయూ కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ సుంకరి జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్‌గా సోషియాలజీ విభాగం కాంట్రాక్టు అధ్యాపకుడు డాక్టర్ పుల్లా రమేశ్‌లు నియమితులయ్యారు. అలాగే కేయూ అకాడమిక్ ఆడిట్ డీన్‌గా వర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వైస్‌ప్రిన్సిపాల్‌గా పనిచేసిన కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ జి.హన్మంతును నియమించారు. నూతన పరిపాలన అధికారులకు గురువారం కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డిలు ఉత్తర్వులు అందచేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, కేయూ టీచింగ్, నాన్‌టీచింగ్ ఏఆర్ పెండ్లి అశోక్‌బాబు తదితరులున్నారు.

. వైస్ ప్రిన్సిపాల్ ఎంపికపై విమర్శలు

కేయూక్యాంపస్, ఫిబ్రవరి 29: కాంట్రాక్టు అధ్యాపకులు డాక్టర్ పుల్లా రమేశ్‌ను యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా నియమించడంపై విమర్శలు వెల్లువెత్తున్నాయి. కళాశాలలో రెగ్యులర్ అధ్యాపకులున్నప్పటికీ కాంట్రాక్టు అధ్యాపకుడికి వైస్ ప్రిన్సిపాల్ పోస్టును కేటాయించడం పట్ల పలువురు అభ్యంతరాలు తెలుపుతున్నారు. తమను కాకుండా కాంట్రాక్టు అధ్యాపకుడికి వైస్ ప్రిన్సిపాల్‌గా ఎంపిక చేయడం పట్ల విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

ఉత్తమ గ్రేడే లక్ష్యం..

నేటినుంచి పదో తరగతి ప్రీఫైనల్స్ ప్రారంభం

18 నుంచి జరిగే పబ్లిక్ పరీక్షలకు సమాయత్తం

ఆందోళన వద్దంటున్న విషయ నిపుణులు



కంబాలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల స్టడీ అవర్స్‌లో విద్యార్థులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 29 : పదో తరగతి విద్యార్థుల్లో భయాన్ని తొలగించడంతో పాటు.. మరి కొన్నిరోజుల్లో జరిగే వార్షిక పరీక్షలను నిర్భయంగా రాసేలా విద్యాశాఖ విద్యార్థులను సంసిద్ధులను చేస్తోంది. చిన్నారుల భవిష్యత్‌కు తొలిమెట్టులాంటి పదోతరగతిలో ఉన్నత మార్కులతో ఉత్తీర్ణులయ్యేలా దిశానిర్దేశం చేస్తోంది. ఈ క్రమంలోనే వారిని పబ్లిక్ పరీక్షలకు సమాయత్తం చేసేలా శుక్రవారం నుంచి ప్రీ ఫైనల్ పరీక్షలనునిర్వహిస్తోంది. ఇక వచ్చేనెల 18వ తేదీన నుంచి జరిగే వార్షిక పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలి? కొద్దిపాటి సమయాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలి? ఒత్తిడి, భయానికి తావులేకుండా పరీక్షలు ఎలా రాయాలి? లాంటి పలు అంశాలపై కొత్త ప్రణాళికలతో ముందుకుపోతోంది. దీంతో విద్యాశాఖాధికారులు ప్రత్యేక తరగతులు, శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఇందులో కూడా ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన తరగతుల్లో విద్యార్థులకు దాతలు, ఉపాధ్యాయుల ద్వారా అల్పాహారం అందజేశారు.

తెలుగును అవగాహనతో చదవాలి..

ప్రస్తుతం ఉన్న పాఠ్యాంశాలు పాతవిధానంలో కాకుండా సొంత భావన, సృజనాత్మకత వెలికి తీసేలా ఉన్నాయి. ఓ అవగాహనతో.. అర్థం చేసుకుంటూ చదవాలి. గతంలో మాదిరిగా కాదు.. ఇప్పుడు బాగా రాస్తేనే మంచి మార్కులు వస్తాయి. అక్షర దోషాలు లేకుండా వాక్యనిర్మాణం రాయడంపై సాధన చేయాలి.

తక్కువ మార్కులని హిందీపై నిర్లక్ష్యం వద్దు..

హిందీలో పాస్‌మార్కులు తక్కువ కదా! అని నిర్లక్ష్యం చేయొద్దు. మనసు పెట్టి చదవాలి. ముఖ్యంగా హిందీ ప్యాసేజ్‌లు బాగా చదవాలి. ఇందులోనే 20 మార్కులు వస్తాయి. ప్రతీ పాఠంలో ఉండే కవి పరిచయాలను నేర్చుకోవాలి. బిట్స్‌ను బాగా నేర్చుకోవాలి.

ఇంగ్లీష్ అంటే భయం వీడాలి..

ప్రణాళికబద్ధంగా ఉపాధ్యాయుడి మార్గదర్శకతతో ఇంగ్లీష్ చదవాలి. ముందు భయాన్ని వీడి పాఠ్యాంశాలను అర్థం చేసుకుంటూ ముందుకెళ్లాలి. గ్రామర్‌పై దృష్టిసారిస్తే సులభంగా మార్కులు తెచ్చుకోవచ్చు. వీటితోపాటు చక్కటి రాతతో లెటర్ రైటింగ్‌పై సాధన చేయాలి. సృజనాత్మకత ప్రదర్శించి మంచి ఫలితాలు సొంతం చేసుకోవచ్చు.

గణితంలో మాదిరి ప్రశ్నపత్రాలను..

కొత్తసిలబస్ విధానంలో పరీక్ష ఉన్నా సీసీఈ మోడలే కనుక ఇబ్బంది ఉండదు. గణితంలో ప్రధానంగా మాదిరి ప్రశ్నాపత్రాలను చూసి, పట్టుదలతో సాధన చేయాలి. అభ్యాసంలో ఉండే ప్రశ్నలేకాకుండా వాటి అప్లికేషన్స్‌ను కూడా పూర్తిగా ఆకళింపు చేసుకోవాలి. పాఠశాలలో జరిగే సెలబస్, ఉపాధ్యాయులు తయారుచేసే ప్రశ్నాపత్రాలను ఆకలింపు చేసుకొని పరీక్షలకు ప్రిపేర్ కావాలి. ఏదేని ఒక ప్రాబ్లమ్‌ను పదేపదే ప్రాక్టిస్ చేస్తే ఫలితాలు మెరుగ్గా వస్తాయి. ఎలాంటి సందేహం ఉన్నా ఉపాధ్యాయుడిని సంప్రదించాలి.

పాఠ్యపుస్తకాలను బాగా చదవాలి..

ప్రతీ విద్యార్థి పాఠ్యపుస్తకాన్ని సామాన్యశాస్త్రాన్ని క్షుణ్ణంగా చదవాలి. ఏ ప్రశ్న ఇచ్చినా రాసేస్థాయికి రావాలి. బట్టీ పడితే అలా రాయడం కష్టమవుతుంది. ఆ విధానానికి స్వస్తి చెప్పి, అర్థం చేసుకుంటూ చదవాలి. 1, 2 మార్కుల ప్రశ్నలపైన దృష్టి సారించాలి. వీటికైతే సింపుల్‌గా రాసినా మార్కులు వచ్చే దానికి అవకాశం ఉంటుంది. ఇప్పటి నుంచే ప్రణాళిక బద్ధంగా చదవితే మంచి మార్కులను సాధించవచ్చు. ఇక సాంఘిక శాస్త్రంలో ముఖ్యంగా ఆలోచించి రాసే విధంగా విద్యార్థులు తయారు కావాలి. బట్టీ పట్టి రాసే విధానాన్ని స్వస్తి పలకాలి. బాగా చదవడం ప్రాక్టిస్ చేయాలి. చదివిన ముఖ్యాంశాలను రాయడం ప్రాక్టీస్ తరహాలో కొనసాగించాలి. ఉన్న విషయాలను విశదీకరణగా రాస్తే మంచి మార్కులు వచ్చే అవకాశం ఉంటుంది.

ప్రీఫైనల్ ఎందుకంటే..

రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ క్యాలెండర్ షెడ్యూల్ ప్రకారం మార్చి 1వ తేదీ నుంచి టెన్త్ ప్రీ ఫైనల్స్ ఆరంభమవుతున్నాయి. షెడ్యూల్ ప్రకారం ఈ ఎగ్జామ్స్ పూర్తి కాగానే జవాబుపత్రాల వాల్యుయేషన్ చేసి వాటిని మళ్లీ టెన్త్ విద్యార్థులకు ఇచ్చి జరిగిన పొరపాట్లు చూపి పబ్లిక్ ఎగ్జామ్స్‌కు సన్నద్ధం చేస్తారు. తద్వారా విద్యార్థులు ప్రతీ ఒక్కరు ఉత్తీర్ణత సాధించడంతో పాటు గ్రేడింగ్ తెచ్చే అవకాశం ఉంటుంది. విద్యార్థులు ఆందోళనకు గురవకుండా ప్రీఫైనల్స్‌ను ప్రాక్టికల్‌గా తీసుకుంటే పబ్లిక్ ఎగ్జామ్స్‌లో సులువుగా ఉత్తీర్ణతలో గ్రేడింగ్ పొందుతారు.

వార్షిక పరీక్షలకు ఇవి తొలిమెట్టు

రామారావు, జిల్లా విద్యాశాఖాధికారి, మహబూబాబాద్



మార్చి 18 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి వార్షిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ప్రీఫైనల్ పరీక్షలు తొలి మెట్టు. ఈ పరీక్షలు రాసిన విద్యార్థులకు వార్షిక పరీక్షల్లో ఏ పాఠ్యాంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి. వాటిని ఏ విధంగా రాయాలి అనే అంశాలపై ఒక అవగాహన ఏర్పడుతుంది. పరీక్షలంటే భయం వీడి ఈ పరీక్షల రాసిన విధంగానే ఎలాంటి ఆందోళన లేకుండా వార్షిక పరీక్షలు రాయొచ్చు అనే భావన కలుగుతుంది. తద్వారా వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించగలుగుతారు.

మేడారం హుండీల లెక్కింపు ప్రారంభం

పోలీసు బందోబస్తు, సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు

350 మంది సిబ్బంది నియామకం

హుండీల్లో అంబేద్కర్ బొమ్మ ఉన్న నకిలీ నోట్లు

పది రోజుల పాటు కొనసాగనున్న ప్రక్రియ

తొలిరోజు రూ.3.15 కోట్లకుపైగా రాక



హుండీలను లెక్కింపునకు మోసుకొస్తున్న సిబ్బంది



బెల్లం, పసుపు, కుంకుమతో తడిసి ముద్దయిన నోట్లు

హనుమకొండ, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి) : పటిష్ఠ బందోబస్తు, సీసీ కెమెరాల నిఘా మధ్య మేడారం సమ్మక్క సారలమ్మ జాతర హుండీల లెక్కింపు ప్రక్రియ గురువారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ సమీపంలోని టీటీడీ కల్యాణ మండపంలో ప్రారంభమైంది. ఫిబ్రవరి 21వతేదీ నుంచి 24 వరకు జరిగిన మహాజాతరకు కోటిన్నర మందికి పైగా భక్తులు తరలొచ్చిన విషయం తెలిసిందే. జాతర ముగియగానే హుండీలను హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపానికి తరలించి భద్రపరిచారు. ఈ క్రమంలో గురువారం ఉదయం 9గంటలకు దేవాదాయ, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారుల సమక్షంలో హుండీల లెక్కింపు ప్రారంభమవగా దేవాదాయ, రెవెన్యూ శాఖలకు చెందిన 150మంది సిబ్బందితో పాటు పలు స్వచ్ఛంద సంస్థలకు చెందిన 200మంది కార్యకర్తలు మొత్తం 350మంది ఈ ప్రక్రియలో పాల్గొంటున్నారు. అయితే హుండీల లెక్కింపు పూర్తి కావడానికి పది రోజులు పట్టవచ్చునని దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రామల సునీత తెలిపారు. హుండీ లెక్కింపులో పాల్గొనే సిబ్బందికి, స్వచ్ఛంద కార్యకర్తలకు ప్రత్యేక డ్రెస్‌కోడ్‌ను ఏర్పాటు చేశారు. మగవారు లుంగీ, బనీను ధరించగా, మహిళలు కాషాయ రంగు చీర, జాకెట్ ధరించారు. లెక్కింపులో పాల్గొనేవారి పేర్లు, వారి చిరునామాల తదితర వివరాలను నమోదు చేశారు. హుండీల లెక్కింపు రోజూ ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరగనుంది. మేడారం పూజారుల సమక్షంలో దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంతరావు నేతృత్వం అసిస్టెంట్ కమిషనర్ ఆర్ సునీత, మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర కార్యనిర్వహణాధికారి రాజేంద్రం ములుగు ఆర్‌డీవో సత్యపాల్ రెడ్డి హుండీల లెక్కింపును పర్యవేక్షిస్తున్నారు. అయితే తొలిరోజు 134 హుండీలను తెరవగా విదేశీ కరెన్సీతో కలుపుకొని రూ.3,15,40,000 ఆదాయం సమకూరిందని ఈవో రాజేంద్రం తెలిపారు.

ప్రత్యేక మిషన్ ఏర్పాటు

నోట్లు, నాణేలను వేరుచేయడానికి వీలుగా ప్రత్యేకంగా ఒక మిషన్‌ను ఏర్పాటు చేశారు. గతంలో నాణాలను వేరుచేయడానికి జల్లెడపట్టేవారు. దీని వల్ల ఎక్కువ సమయం పట్టేది. ఈ మిషన్‌కు ఉన్న జల్లెడ భాగంలో హుండీని కుమ్మరించగానే అందులోని బియ్యం కిందకు పడిపోతాయి. నాణాలు జారుకుంటూ ముందుకు వస్తాయి. జల్లెడపై నోట్లు మిగిలిపోతాయి. నాణేలతో పాటు వెండి, బంగారు వస్తువులు కూడా వేరవుతాయి. ఈ లెక్కింపులో ఎలాంటి అక్రమాలు జరగకుండా పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. లెక్కింపు కేంద్రం బయట, లోపల 60కిపైగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఒక మానిటర్‌ను అమర్చారు. ఈ మానిటర్ ద్వారా నిరంతరం గమినించేందుకు ప్రత్యేకంగా పోలీసు సిబ్బందిని నియమించారు. సిబ్బంది లెక్కింపు కేంద్రం లోపలికి వెళ్లే ముందు, లెక్కింపు పూర్తయిన తర్వాత బయటకు వచ్చేపుడు తనిఖీ చేసేందుకు మెటల్ డిటెక్టర్లను అమర్చారు. ఎవరిపైనైనా అనుమానం వస్తే వెంటనే వారిని పక్కన పెడతారు. లెక్కింపు ప్రక్రియ ఆసాంతం వీడియో చిత్రీకరణలో సాగుతోంది.

క్రమ సంఖ్య ప్రకారం..

మేడారం నుంచి మొత్తం 518 హుండీలను లెక్కింపు కేంద్రానికి తరలించారు. ప్రతీ హుండీకి ఒక నెంబర్ కేటాయించి.. వాటిని పకడ్బందీగా సీల్ చేసి.. వాటిపై డీసీ, ఏసీ, ఈవో సంతకాలు చేశారు. వాటి క్రమసంఖ్య ప్రకారం హుండీలను, వాటి సీళ్లను పరిశీలించి సక్రమంగా ఉందని నిర్ధారించుకున్న తర్వాతే తెరిచేందుకు అధికారులు అనుమతిస్తున్నారు. ఇదంతా పూజారుల సమక్షంలోనే జరుగుతోంది.

తడిసి ముద్దయిన నోట్లు

హుండీల్లోని చాలా నోట్లు బెల్లం, పసుపు, కుంకుమలతో తడిసి ముద్దయ్యాయి. వీటిని సబ్బు నీళ్లలో నానబెట్టి కడిగి శుభ్రం చేసిన తర్వాత ఇస్త్రీ చేయడం ద్వారా పూర్వ రూపానికి తీసుకొవస్తున్నారు. పూర్తిగా చిరిగిపోయిన నోట్లను పక్కన పెడుతున్నారు. హుండీల్లో నోట్లతో పాటు బంగారు, వెండి కానుకలు కూడా వస్తుండగా.. వాటిని భద్రపరుస్తున్నారు. ఈ కానుకను చివర తూకం వేసి వాటి బరువును రికార్డు చేస్తారు. లెక్కించిన నోట్లను వాటి డినామినేషన్ ప్రకారం వేరువేరుగా కట్టలు కట్టి.. ఏరోజు కారోజు బ్యాంకులో జమ చేస్తున్నారు. ఈ మేరకు బ్యాంకు సిబ్బందిని కూడా లెక్కింపు కేంద్రంలో అందుబాటులో ఉంచారు.

ఈ సారి ఆదాయం పెరిగే అవకాశం..

ఈ సారి మేడారం సమ్మక్క సారలమ్మ జాతర హుండీ ఆదాయం పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ప్రతీ జాతరకు ఆదాయం క్రమంగా పెరుగుతూ వస్తుండగా.. 2022 జాతరలో రూ.12,45,49,727 ఆదాయం వచ్చింది. గత జాతర కన్నా ఈ సారి భక్తులు భారీగా తరలొచ్చారన్న అంచనా మధ్య ఆదాయం కూడా పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. 1968 నుంచి మేడారం జాతర ఆదాయ వ్యయాలను అధికారికంగా లెక్కిస్తూ వస్తున్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు 28జాతరలు జరగ్గా.. ఆదాయంతో పాటు ఖర్చు కూడా పెరుగుతూ వస్తోంది. 1978, 2014లో మినహా మిగతా సంవత్సరాల్లో జరిగిన జాతరల్లో ఆదాయం పెరిగింది. కరోనా కాలమైన 2020లోనూ ఆదాయం తగ్గలేదు.

అంబేద్కర్ చిత్రంతో ఉన్న నగదు రాక..

హుండీల నుంచి నకిలీ కరెన్సీ నోట్లు బయటపడుతున్నాయి. నోట్లపై మహాత్మాగాంధీ ఫొటోకు బదులు పలు రూ.100నోట్లపై డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఫొటో ఉండడంతో అందరూ ఆశ్చర్యపోయారు. మొదట తెరిచిన హుండీల్లో ఈ నకిలీ కరెన్సీ రాగా.. ఇలాంటివి అయిదారు నోట్లు వచ్చాయి. అయితే కరెన్సీ నోట్లపై అంబేద్కర్ బొమ్మను కూడా ముద్రించాలన్న డిమాండ్ వస్తున్న సమయంలో ఈ డిమాండ్‌ను జనంలోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్న ఉద్దేశ్యంతోనే ఇలా చేసి ఉంటారని అధికారులు భావిస్తున్నారు.

ఉద్యోగార్థుల్లో ఉత్సాహం..

(5వ పేజీ తరువాయి)

నిర్వహించాలని కోరుతున్నారు. జోన్ల ప్రాతిపదికన ఎంపికలు నిర్వహిస్తే కొత్తగా ఏర్పడిన జిల్లాల్లోని అభ్యర్థులు తీవ్రంగా నష్టపోయే అవకాశముందని వారు అభిప్రాయపడుతున్నారు. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన ఎంపికలు నిర్వహిస్తేనే ఎక్కువ మంది అభ్యర్థులకు న్యాయం జరిగే అవకాశం ఉందంటున్నారు. అలాగే భర్తీ ప్రక్రియను పారదర్శకంగా త్వరితగతిన పూర్తి చేయాలని ఉపాధ్యాయ సంఘాల నేతలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. మరో రెండు నెలల్లో వేసవి సెలవులు రానున్న నేపథ్యంలో భర్తీ ప్రక్రియను వేసవి సెలవుల వరకు పూర్తి చేసి, వచ్చే విద్యా సంవత్సరానికి కొత్త ఉపాధ్యాయులు విధుల్లో చేరేలా చర్యలు తీసుకోవాలంటున్నారు. గత ప్రభుత్వం మాదిరిగా నోటిఫికేషన్ జారీ చేసి కాలయాపన చేయకుండా ప్రక్రియను వేగంగా పూర్తిచేయాలంటున్నారు.

పూర్తి స్థాయిలో పోస్టులను భర్తీ చేయాలి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2,500 పోస్టులు ఖాళీగా ఉన్నాయని వాటన్నింటిని భర్తీ చేయాలని ఉపాధ్యాయ ఉద్యోగార్థులు కోరుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విద్యాశాఖలో మొత్తం మంది 130 ఐఈఆర్పీలు పనిచేస్తున్నారు. వారందరు డీఎస్సీలో తమకు వెయిటేజీ మార్కులు కలపాలని, పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించిన డీఎస్సీలో వెయిటేజీ మార్కులు కలపినట్లు వారు గుర్తు చేస్తున్నారు.

4వతేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ...

డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసిన ప్రభుత్వం.. ఈ నెల 4వతేదీ నుంచి ఏప్రిల్2 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనుంది. అభ్యర్థులు పరీక్ష ఫీజు కింద రూ.వెయ్యి చెల్లించాల్సి ఉంటుంది. ఒకటి కంటే ఎక్కువ పోస్టులకు దరఖాస్తులు చేసేవారు ఒక్కో పోస్టుకు రూ.వెయ్యి చెల్లించాల్సి ఉంటుంది. పరీక్ష తేదీలను తర్వాత ఖరారు చేస్తామని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. పరీక్ష విధానం పూర్తిగా కంప్యూటర్ బేస్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్(సీబీఆర్‌టీ) విధానంలో ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నారు.

జిల్లాల వారీగా ఖాళీలు ఇవే...

ఉమ్మడి జిల్లాలో మొత్తం 1,519 పోస్టులు ఖాళీగా ఉన్నట్టు ప్రభుత్వం వెల్లడించింది. వరంగల్ జిల్లాలో 301, హనుమకొండలో 187, జనగామలో 221, మహబూబాబాద్‌లో 381, ములుగలో 192, జయశంకర్ భూపాల్లిలో 237 పోస్టులు ఖాళాగా ఉండగా.. వాటిని ఈ మెగా డీఎస్సీ ద్వారా భర్తీ చేయనుంది.

జిల్లా	ఎస్ఏలు	ఎల్పీలు	పీఈటీలు	ఎస్జీటీలు	స్పెషల్	మొత్తం
వరంగల్	66	21	6	182	26	301
హనుమకొండ	73	5	7	81	21	187
జనగామ	50	21	7	118	25	221
మహబూబాబాద్	71	19	2	264	25	381
ములుగు	33	16	1	125	17	192
భూపాలపల్లి	41	20	7	152	17	237

అందివచ్చిన ఆయుర్వేదం

ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రిలో టి-డయాగ్నస్టిక్ సేవలు

అందుబాటులోకి వచ్చిన అన్ని రకాల ఉచిత ల్యాబ్ పరీక్షలు

వరంగల్ ఆయుర్వేద ఆస్పత్రిలో మెరుగైన వైద్యం



ల్యాబ్‌లో రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

గిర్మాజీపేట, ఫిబ్రవరి 29 : దీర్ఘకాలిక, మొండి రోగాలకు శాశ్వత పరిష్కారంగా ఆయుర్వేద వైద్యాన్ని అందిస్తున్న వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద బోధనాస్పత్రిలో అన్ని రకాల ల్యాబ్ పరీక్షలు అందుబాటులోకి వచ్చాయి. ఇప్పటివరకు సాధారణ పరీక్షలకు పరిమితమైన ల్యాబ్‌ను తెలంగాణ డయాగ్నస్టిక్ పరిధిలోకి తేవడంతో అన్ని రకాల పరీక్షలు అందుబాటులోకి రావడంతో రోగులు, వారి బంధువులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వరంగల్‌లోని బస్టాండ్, రైల్వేస్టేషన్‌లకు కూతవేటు దూరంలో అధునాతన భవనాలు, సదుపాయాలతో ప్రత్యేక ఆయుర్వేద వైద్య విభాగాలతో వైద్య సేవలు అందిస్తోంది. అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలకు బోధన ఆస్పత్రిగా పనిచేస్తున్న 120 పడకలు ఆస్పత్రిలో నిత్యం 90మంది ఇన్‌పేషెంట్లు, 300 మంది అవుట్ పేషెంట్‌లు వైద్య సేవలు పొందుతుంటారు. జలుబు, దగ్గు, బీపీ, మధుమేహం, పక్షవాతం, నడుము, వెన్నుముక, కీళ్ల, స్పాండిలైటిస్, మైగ్రేన్, సైనసైటిస్, సోరియాసిస్, అర్షమొలలు, భగందరం, డయాబెటిక్ రెటినోపతి, డయాబెటిక్ ఫుట్, వెరికోస్ వెయిన్స్ తదితర వ్యాధులకు నిష్ణాతులైన వైద్యులు ఆయుర్వేద వైద్యాన్ని అందిస్తుంటారు. ఈ ఆస్పత్రిలో లభిస్తున్న మెరుగైన ఆయుర్వేద వైద్య సేవలతో దీర్ఘకాలిక, మొండి తదితర రోగాలకు పరిష్కారం లభిస్తుండడంతో వరంగల్ జిల్లా నుంచే కాకుండా రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలు, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాలకు చెందిన రోగులు వస్తుండటంతో ఆస్పత్రి రద్దీగా ఉంటుంది.

ఆస్పత్రి ల్యాబ్‌లో సాధారణ పరీక్షలు

ఆస్పత్రికి వస్తున్న రోగులకు రోగ నిర్ధారణ, తగిన వైద్య చికిత్సల కోసం రోగులకు వివిధ పరీక్షలు చేయాల్సి ఉంటుంది. ల్యాబ్ పరీక్షల ప్రకారమే వైద్యులు రోగుల వ్యాధి నిర్ధారణ చేస్తారు. అయితే ల్యాబ్‌లో సాధారణ మూత్ర, రక్త పరీక్షలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. కీళ్ల నొప్పులు, రుమాటాయిడ్ అర్థరైటిస్, కిడ్నీ, లివర్, మూడు నెలల షుగర్ స్థాయిలు నిర్ధారించే ఎచ్‌బిఎ1సి తదితర ముఖ్యమైన పరీక్షలు ఆస్పత్రి ల్యాబ్‌లో అందుబాటులో లేవు. వందల రూపాయల వ్యయం అయ్యే ఈ పరీక్షల కోసం రోగులు ప్రయివేటు ల్యాబ్‌లకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. సహజంగా ఇక్కడికి వచ్చే రోగులు పేద, దిగువ మధ్య తరగతి, గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారే ఎక్కువ ఉంటారు. రోగుల పరిస్థితిని గమనించిన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జగన్మోహనాచారి ఆయుష్ ఉన్నతాధికారులు, ఆయుర్వేద జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారితో సంప్రదించి తెలంగాణ డయాగ్నస్టిక్ పరిధిలోకి వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద బోధన ఆస్పత్రిని తీసుకురావాలని కోరారు. ఆస్పత్రిలో పెరుగుతున్న రోగుల సంఖ్య, రోగ నిర్ధారణ ల్యాబ్ పరీక్షల అవశ్యకతను వివరించడంతో దృష్టిలో అధికారులు టీ డయాగ్నస్టిక్ సేవలను ఆయుర్వేద ఆస్పత్రికి పాక్షికంగా అందుబాటులోకి తెచ్చారు. కాశిబుగ్గ అర్బన్ హెల్త్ సెంటర్ ద్వారా ఆయుర్వేద ఆస్పత్రి శాంపిల్స్ పంపించేందుకు అధికారులు ఆమోదం తెలిపారు

టి-డయాగ్నస్టిక్ సేవలతో...

ఇప్పటి వరకు సాధారణ రక్త, మూత్ర పరీక్షలకే పరిమితం కాగా, టీ డయాగ్నస్టిక్స్ సేవలు అందుబాటులోకి రావడంతో అన్ని రకాల పరీక్షలు చేస్తున్నారు. కిడ్నీ, లివర్ ఫంక్షన్, ఎచ్‌బిఎ1సి తదితర రుమాటాయిడ్ అర్థరైటిస్ తదితర రోగులకు సైతం పరీక్షలు చేస్తున్నారు. టీ డయాగ్నస్టిక్ సెంటర్‌లో చేసే సుమారు 80పరీక్షలకు సంబంధించి ఉచితంగా అందుబాటులోకి తెచ్చారు. ఆస్పత్రి ల్యాబ్ ఇన్‌చార్జ్ డాక్టర్ కె. సాంబమూర్తి పర్యవేక్షణలో ల్యాబ్ టెక్నీషియన్ పవన్ పరీక్షలు చేస్తున్నారు. రోగుల ఆధార్ కార్డు, దీనికి అనుసంధానమైన మొబైల్ ఫోన్ నెంబర్‌ను రిజిస్ట్రేషన్ చేసుకుని వారి నుంచి సేకరించిన రక్త నమూనాలను కాశిబుగ్గ అర్బన్ హెల్త్ సెంటర్ ద్వారా ప్రతి రోజు నర్సంపేటలోని టీ డయాగ్నస్టిక్ సెంటర్‌కు పంపుతున్నారు. నిర్ధారణ ఫలితాల సంబంధిత రోగుల మొబైల్ నెంబర్‌కే మరుసటి రోజు వస్తుండటంతో రోగుల్లో సంతోషం వ్యక్తం అవుతోంది.

మెరుగైన వైద్య సేవలు

డాక్టర్ జగన్మోహనాచారి, సూపరింటెండెంట్



నిష్ణాతులైన వైద్యులు, సిబ్బంది సేవలతో ఆయుర్వేదంపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతోంది. అన్ని రకాల దీర్ఘకాలిక, మొండి రోగాలకు ఉచిత వైద్య సేవలు అందుతుండడంతో రోగులు సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఇతర రాష్ట్రాలవారుసైతం వస్తున్నారు. టీ డయాగ్నస్టిక్ సెంటర్ పూర్తిస్థాయిలో అస్పత్రిలో అందుబాటులోకి త్వరలోనే రానుంది. అస్పత్రి నుంచే రోగుల రక్త నమూనాలను పంపేందుకు ఉన్నతాధికారుల సహకారంతో చర్యలు చేపట్టాం.

మూడు ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన శ్రావణి



నెక్కొండ, ఫిబ్రవరి 29 : ఒకటి కాదు.. రెండు కాదు... ఏకంగా మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన నెక్కొండకు చెందిన 36 సంవత్సరాల వయస్సు గల సొంటిరెడ్డి శ్రావణిని గురువారం మండల ప్రజలు, విద్యావేత్తలు అభినందించారు. నెక్కొండకు చెందిన అడ్వకెట్ సొంటిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి భార్య శ్రావణి ఎంఎస్సీ, బీఈడీ విద్యను అభ్యసించింది. ప్రస్తుతం కరీంనగర్ జిల్లా భీమదేవరపల్లిలోని కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలలో ఐదు సంవత్సరాల నుంచి కెమిస్ట్రీ కాంట్రాక్ట్ లెక్చరర్‌గా విధులను నిర్వహిస్తోంది. తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ బోర్డ్ ఫలితాలలో డిగ్రీ లెక్చరర్, జూనియర్ లెక్చరర్, పీజీటీ ఫిజికల్ సైన్స్‌లో తెలంగాణ స్టేట్ లెవల్‌లో 147 ర్యాంక్ సాధించారు. గురుకులం పోస్టు గ్రాడ్యువేట్‌కు ఎంపికకావడంతో ఫిబ్రవరి 14న ముఖ్యమంత్రి రెవంత్‌రెడ్డి నుంచి నియామక పత్రం అందుకున్నారు. అలాగే ఫిబ్రవరి 22న డిగ్రీ లెక్చరర్ ఇంటర్వ్యూకు హాజరు కాగా, 28వ తేదిన విడుదల చేసిన ఫలితాల్లో ఎంపికైంది. అలాగే ఈ నెల 24వ తేదిన జూనియర్ లెక్చరర్ ఇంటర్వ్యూకు హాజరు కాగా, ఫిబ్రవరి 29 తేదిన విడుదల చేసిన ఫలితాల్లో శ్రావణి ఎంపీకైనట్లు ప్రకటించారు. మూడు పోస్టు గ్రాడ్యుయేషన్ టీచర్ (పీజీటీ) ఉద్యోగాలకు శ్రావణి ఎంపికైంది.

ఆస్తి పన్నుపై 90 శాతం వడ్డీ మాఫీ

బల్దియా ఇన్‌చార్జ్ కమిషనర్ ప్రావీణ్య

జీడబ్ల్యూఎంసీ (హనుమకొండ సిటీ) ఫిబ్రవరి 29: ఆస్తి పన్నుపై 90 శాతం వడ్డీ మాఫీ కల్పించినట్లు జీడబ్ల్యూఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ప్రావీణ్య తెలిపారు. గురువారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. వడ్డీ మాఫీ ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఆస్తి పన్ను బకాయిలపై విధించిన వడ్డీలో 90 శాతం మాఫీ పొందవచ్చాన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి చెందిన వడ్డీ మాఫీ 90 శాతం మేరకు ఉంటుందన్నారు. మిగతా 10 శాతం వడ్డీని వన్ టైమ్ సెటిల్‌మెంట్ ద్వారా చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024 మార్చి వరకు వడ్డీ లేదా పెనాల్టీలతో సహా మొత్తం ఆస్తి పన్ను బకాయిలు చెల్లించిన వారికి కూడా ఈ స్కీం వర్తిస్తుందన్నారు. ఎలాంటి ఆందోళనకు గురికావాల్సి అవసరం లేదని 90 శాతం వడ్డీని రానున్న ఆస్తి పన్ను బిల్లుల్లో సర్దుబాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నగరవాసులను కోరారు.

పోగొట్టుకున్న మొబైల్ అప్పగింత

మడికొండ, ఫిబ్రవరి 29: పోగొట్టుకున్న మొబైల్‌ను సంబంధిత వ్యక్తికి అందజేసి పోలీసులు తమ విధ్యుక్త ధర్మాన్ని చాటుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన జయప్రకాష్ అనే వ్యక్తి మడికొండలోని ఓం గ్రానైట్ వద్ద గురువారం తన మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. ఈ విషయమై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు దర్యాప్తు చేసిన పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా మొబైల్‌ను గుర్తించారు. వెంటనే మొబైల్‌ను కనిపెట్టి స్థానిక సీఐ ప్రతాప్ ద్వారా బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా బాధితుడు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి: ఏపీఎం

వరంగల్(సంగెం), ఫిబ్రవరి 29 : మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఫామ్ ఏపీఎం సుధాకర్ అన్నారు. సంగెం మండల కేంద్రంలో శాంతి మండల సమాఖ్య కార్యాలయంలో గురువారం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ- గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో లఖ్‌పతి దీదీ శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏపీఎం కిషన్ ఆధ్యక్షత వహించగా సుధాకర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలకు జీవనోపాధి కల్పించాలనే లక్ష్యంతోనే గేదెల పంపకం, చేపలు, కూరగాయల సాగు, సోలార్, టైలర్, ఎంబ్రాయిడరీ, పండ్ల అమ్మకం, కిరాణ షాపులు, జనరల్ స్టోర్స్, వస్త్ర దుకాణాల వంటి విషయాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీసీలు బి.రమేష్, జి.కుమార స్వామి, జి.ఏలియా, విజస్వరూప, రాణి, కృష్ణ మూర్తి, సుజాత, కృష్ణ పాల్గొన్నారు.

అంతా కోతలే..



- మూడు నెలల్లో నార్మల్ డెలివరీలు 692 మాత్రమే..
- ఆపరేషన్లు 2,136...
- ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆపరేషన్లే అధికం
- ప్రభుత్వాస్పత్రుల్లో కానరాని అవగాహన సదస్సులు
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న గర్భిణులు

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 29: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో నార్మల్ డెలివరీలు గణనీయంగా తగ్గడంతో మేధావులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు అంతా ఆపరేషన్లకే మొగ్గుచూపడంతో తర్వాతి కాలంలో గర్భిణులు అనారోగ్యం బారిన పడుతున్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలను ఖర్చు చేస్తున్నా ఫలితం కానరావడం లేదు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పేర్లు నమోదు చేసుకున్న గర్భిణులకు మందులతోపాటు, పరీక్షలను కూడా ఉచితంగా చేస్తున్నారు. డెలివరీ తర్వాత శిశువుకు కిట్‌తోపాటు నగదు ప్రోత్సాహకాలను ప్రభుత్వం అందిస్తోంది. అయితే రెండేళ్లుగా గర్భిణులకు వైద్యపరమైన అవగాహన సదస్సులు నిర్వహించడం లేదు. వరంగల్ రూరల్ జిల్లా ఏర్పడిన అనంతరం 2019లో రాష్ట్రంలోనే ప్రభుత్వ ఆస్పత్రుల్లో గర్భిణుల నమోదు పెరిగింది. నార్మల్ డెలివరీలు, ఆపరేషన్లు తక్కువ జరిగిన వైద్య సేవలకు గుర్తింపుగా జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. గత రెండేళ్ల నుంచి ప్రభుత్వ ఆస్పత్రుల్లో గర్భిణుల నమోదు సంఖ్య తగ్గడం, ప్రోత్సాహకాలు ఇవ్వకపోవడం గర్భిణులకు నిరాశ చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నార్మల్ డెలివరీలు పెరిగేలాచూడాలని గర్భిణులు కోరతున్నారు.

జిల్లాలో డెలివరీలు ఇలా..

వరంగల్ జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ హెల్త్ కేంద్రాల్లో నవంబరులో మొత్తం 1,046 డెలివరీలు జరుగగా, ప్రభుత్వ ఆస్పత్రుల్లో నార్మల్ డెలివరీలు 245, ఆపరేషన్లు 334 జరిగాయి. ప్రైవేటు ఆస్పత్రుల్లో నార్మల్ డెలివరీలు 63 జరుగగా, ఆపరేషన్లు 386 జరిగాయి. మొత్తం 1046లో నార్మల్ డెలివరీలు 308 కాగా 738 మందికి ఆపరేషన్లు జరిగాయి. అదే డిసెంబరులో డెలివరీలు 1,073 కాగా నార్మల్ డెలివరీలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో 222, ఆపరేషన్లు 360 జరిగాయి. ప్రైవేటు ఆస్పత్రుల్లో నార్మల్ డెలివరీలు 70, ఆపరేషన్లు 408 జరిగాయి. మొత్తం 1073లో 292 నార్మల్ డెలివరీలు జరుగగా 768 మందికి ఆపరేషన్లు జరిగాయి. జనవరిలో 863 డెలివరీలు జరగ్గా నార్మల్ డెలివరీలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో 166, ఆపరేషన్లు 297, ప్రైవేటు ఆస్పత్రుల్లో నార్మల్ డెలివరీలు 59, ఆపరేషన్లు 333 జరిగాయి. ఈ మూడు నెలల్లో 2,982 మంది డెలివరీ కాగా నార్మల్ డెలివరీలు 692, ఆపరేషన్లు 2,136 జరిగాయి.



అనంతపురం వాసులతో జిల్లా ట్రెయినింగ్ మేనేజర్ కూసం రాజమౌళి

గంగదేవిపల్లిని సందర్శించిన అనంతపురంవాసులు

గీసుగొండ, ఫిబ్రవరి 29: మండలంలోని జాతీయ ఆదర్శ గ్రామం గంగదేవిపల్లిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం జిల్లా మడకరశిర మండలంలోని 18 గ్రామాల నుంచి 45 మంది కమ్యూనిటీ డెవలప్‌మెంట్ లీడర్లు గురువారం రాయలసీమ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సందర్శించారు. ఈ సందర్భంగా గంగదేవిపల్లి గ్రామాభివృద్ధి, పలు అభివృద్ధి కమిటీల పనితీరు, ప్రజల భాగస్వామ్యం, సాధించిన అవార్డులు, నగదు పురస్కారాలను బృందానికి జిల్లా ట్రెయినింగ్ మేనేజర్ కూసం రాజమౌళి వివరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ ట్రైనర్స్ రామాంజనేయులు, ఏరియా కో ఆర్డినేటర్ సుదర్శన్‌రెడ్డి, రమాదేవి, వనపర్తి కరుణాకర్, గూడ సరోజన, మేడిద సుశీల పాల్గొన్నారు.

గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో కృష్ణవేణి

గీసుగొండ, ఫిబ్రవరి 29: వేసవిలో మండలంలో నీటి ఎద్దడి లేకుండా చూడాలని ఎంపీడీవో కృష్ణవేణి గ్రామ కార్యదర్శులకు సూచించారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో నీటి సరాఫరాపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో ఓపెన్‌వెల్, బోరుబావుల మోటార్ల మరమ్మతు, పలిగిన పైపులైన్‌ల రిపేరు వంటివి యుద్ధప్రాతిపదికన చేపట్టి నీటి సరఫరాలో ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రియాజుద్దీన్, ఎంపీటీసీలు వీరారావు, భిక్షపతి, మండల కో ఆప్షన్ సభ్యుడు రహీంపాష, ఎంపీవో ప్రభాకర్, ఏఈలు వెంకటేశ్, హిమకరణ్, గ్రామ స్పెషల్ ఆఫీసర్‌లు డాక్టర్ రమేష్, విజయలక్ష్మి, శ్రీనివాస్, పాల్గొన్నారు.

వంచనగిరిలోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాన్ని తహసీల్దార్ రియాజుద్దీన్, ఎంపీడీవో కృష్ణవేణి, ఎంఈవో సత్యనారాయణ సందర్శించారు. విద్యార్థులకు అందించే మెనూను పరిశీలించారు. విద్యార్థుల విద్యాప్రగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం నైట్‌వాచ్ ఉమెన్ పోస్టుకు ఇంటర్వ్యూను నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌వో హిమబిందు, సీఆర్టీలు, పీజీసీఆర్టీలు పాల్గొన్నారు.

నందనాయక్‌తండాలో శివలింగ ప్రతిష్ఠాపన

గీసుగొండ, ఫిబ్రవరి 29: నందనాయక్‌తండాలో శివలింగ ప్రతిష్ఠాపనను గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి శివలింగానికి అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భీమగాని సౌజన్య పాల్గొన్నారు.

కుల, మతాలకు అతీతంగా రాజ్యాంగహక్కులు

గీసుగొండ, ఫిబ్రవరి 29: కుల, మత, వర్గ బేధాలు లేకుండా అందరూ రాజ్యాంగ బద్ధంగా లభించే హక్కులను పొందవచ్చని, వాటికి విఘాతం కలిగితే పోలీసులను ఆశ్రయించాలని ఎస్ఐ వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం గీసుగొండలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ రవిందర్, ఆర్ఐ సాంబయ్య, కార్యదర్శి నూనె వేణుప్రసాద్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కల్యాణి, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సీతక్కను కలిసిన స్పెషల్ టీచర్లు



మంత్రి సీతక్కకు వినతిపత్రం ఇస్తున్న స్పెషల్ టీచర్లు

ఖిలావరంగల్, ఫిబ్రవరి 29: స్పెషల్ రూ.398 వేతనంపై పనిచేసిన స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్స్, పెన్షన్స్ ఇవ్వాలని తెలంగాణ 398 స్పెషల్ టీచర్స్ అండ్ పెన్షనర్స్ అసోసియేషన్ టీచర్స్ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ శిశు సంక్షేమ శాఖా మంత్రి దనసరి అనసూర్య, (సీతక్క)ను కోరారు. గురువారం ములుగు జిల్లాలో ఓ రిటైర్‌మెంట్ కార్యక్రమానికి హాజరైన సీతక్కకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఒకే డీఎస్సీ ద్వారా నియమించబడిన రూ.398 స్పెషల్ టీచర్లు, ప్రత్యేక భాషాపండితులు, ప్రత్యేక వ్యాయామ ఉపాధ్యాయులుగా ప్రభుత్వం నియమించిందన్నారు. గతంలో పోస్టులు లేని కారణంగా కొందరు మాత్రమే గతంలో కేవలం రూ. 398 గౌరవ వేతనంపై మాత్రమే పని చేసి తీవ్రంగా నష్టపోయారన్నారు. పదేళ్ల క్రితం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు ఏర్పడిన తర్వాత అప్పటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 1-3- 2019 ఏపీ జీవో ఎంఎస్ నెంబర్ 28 ప్రకారం నోషనల్ ఇంక్రిమెంట్స్, పెన్షన్ బెనిఫిట్స్ మంజూరు చేశారన్నారు. ఆంధ్రప్రదేశ్ వారిలాగానే తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్స్, పెన్షన్స్ ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో రూ. 398 స్పెషల్ టీచర్ల వరంగల్ జిల్లా గౌరవ అధ్యక్షులు కొదుమూరు రమేష్, జిల్లా అధ్యక్షులు పెద్దూరి పెద్దయ్య, ప్రధాన కార్యదర్శి ఈటూరి యాదగిరిరావు, ఉపాధ్యక్షులు గట్టు జీవన్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌టీపీ నిర్మాణ పనులను ప్రారంభించండి

మేయర్ గుండు సుధారాణి



ఎఫ్‌టీపీ నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న మేయర్ గుండు సుధారాణి

జీడబ్ల్యూఎంసీ (హనుమకొండ సిటీ), ఫిబ్రవరి 29 : వరంగల్ రామన్నపేటలో నిర్మించనున్న ఎఫ్‌టీపీ (మురుగు నీటి శుద్ధికరణ కేంద్రం) పనులను వెంటనే ప్రారంభించాలని మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. గురువారం 29వ డివిజన్‌లోని రామన్నపేటలో నిర్మించే ఎఫ్‌టీపీ స్థలాన్ని ఆమె క్షేత్ర స్థాయిలో అధికారులతో కలిసి పరిశీలించారు. అమృత్ పథకంలో భాగంగా రామన్నపేట ప్రాంతంలో పైలెట్ బేస్‌గా ఎఫ్‌టీపీని నిర్మించనున్నట్లు తెలిపారు. ముంబాయికి చెందిన అగ్రోమార్ఫ్ టెక్నాలజీ సొలుష్యన్స్ ఆధ్వర్యంలో ప్లాంట్ నిర్మాణం జరుగనున్నట్లు తెలిపారు. ఆల్గ బేస్డ్ టెక్నాలజీతో ప్రతీరోజు 1500 లీటర్ల మురుగు నీటిని శుద్ధికరించవచ్చాన్నారు. సంవత్సరం పాటు ట్రాయల్ రన్ అనంతరం ఫలితాల ఆధారంగా నగరంలోని మిగితా డివిజన్‌లలో ప్లాంట్ నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్కి ప్రతినిధులు డాక్టర్ రాజ్ మోహన్‌రెడ్డి, అవినాష్, ఓంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ ఆధారిత ఉత్పత్తులను ప్రోత్సహించాలి



వ్యవసాయ కర దీపికలను ఆవిష్కరిస్తున్న అధికారులు, శాస్త్రవేత్తలు

పీవీ వెటర్నరీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ జ్ఞాన ప్రకాశ్

కృషి విజ్ఞాన కేంద్రంలో శాస్త్రీయ సలహా మండలి

వరంగల్(మామునూరు), ఫిబ్రవరి 29 : వ్యవసాయంతోపాటు వ్యవసాయ ఆధారిత ఉత్పత్తులను ప్రోత్సహించాలని పీవీ నర్సింహారావు తెలంగాణ రాష్ట్ర పశు వైద్య విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జ్ఞాన ప్రకాశ్ ఉద్బోదించారు. మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రాజన్న ఆధ్వర్యంలో గురువారం శాస్త్రీయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వెటర్నరీ యూనివర్సిటీ విస్తరణ అధికారి డాక్టర్ మహేందర్, హైదరాబాద్ ఆటారి ప్రతినిధి డాక్టర్ మాలతిలతోపాటు జ్ఞాన ప్రకాశ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతులు సాగు చేసే వ్యవసాయ పంటలతో పాటు వ్యవసాయ ఆధారిత ఉత్పత్తులను ప్రోత్సహించి ఆర్థిక లాభాలు వచ్చేలా చూడాలని అధికారులను కోరారు.

పాల ఉత్పత్తికి పాడి గేదెలు, ఆవుల మేతకు వేసవి కాలంలో పాతర పడ్డీ తయారు విధానంపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా ఏరువాక కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ దిలీప్ కుమార్, మామునూరు ప్రాంతీయ పశు శిక్షణా కేంద్రం అధికారి డాక్టర్ బాలాజీ, లీడ్ బ్యాంకు మేనేజర్ హవేలి రాజు, జిల్లా మత్స్య శాఖ అధికారి నరేష్ కుమార్ నాయుడు, జిల్లా పశు వైద్య సహాయ సంచాలకులు డాక్టర్ శ్రీనివాసులు, కేవీకే శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.



లింగమూర్తికి నివాళులర్పిస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

కార్మిక నేత లింగమూర్తి సేవలు మరువలేనివి

గిర్మాజీపేట, ఫిబ్రవరి 29: ఆజాంజాహి మిల్లు, బీడీ కార్ఖానాలు, కార్మికుల హక్కుల కోసం పోరాడిన లింగమూర్తి సేవలు మరువలేనివని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఆరెళ్ళి కృష్ణ అన్నారు. ఇటీవల మృతిచెందిన కార్మిక భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టీయు) జాతీయ కమిటీ సభ్యుడు కూరపాటి లింగమూర్తికి ప్రింటింగ్ అండ్ బైడింగ్ వర్కర్స్ యూనియన్ గురువారం నివాళులర్పించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు గంగుల దయాకర్, ఐఎఫ్‌టీయూ నాయకులు డాక్టర్ కొంతం కృష్ణ, బండి కోటేశ్వర్‌రావు, రాచర్ల బాలరాజు, కిరణ్, రాజేందర్, సదానందం, నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వరంగల్(మామునూరు), ఫిబ్రవరి 29 : రంగశాయిపేట-నెక్కొండ రహదారిపై నక్కలపల్లి సమీపంలో గురువారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో సంగెం మండలం గవిచర్ల గ్రామానికి చెందిన సిరంగి సమ్మయ్య (58) అనే వ్యక్తికి తీవ్ర గాయాలు తగిలినట్లు మామునూరు ఎస్ఐ ప్రమోద్ కుమార్ తెలిపారు. నెక్కొండ వైపు నుంచి వరంగల్‌కు వస్తున్న కారు- వరంగల్ నుంచి గవిచర్లకు వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొట్టినట్లు ఎస్ఐ వివరించారు.

ఈ ప్రమాదంలో దిచక్ర వాహనంపై వెళ్తున్న సమ్మయ్యకు తీవ్ర గాయాలు కావడంతో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి 108 వాహనంలో తరలించి చికిత్స చేయిస్తున్నట్లు తెలిపారు. వివరాలు సేకరించి పూర్తి సమాచారం తెలుసుకుంటున్నట్లు ఎస్ఐ వివరించారు.

బాలికను రేప్ చేసిన యువకుడి అరెస్టు

వరంగల్(సంగెం), ఫిబ్రవరి 29: మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై లైంగిక దాడికి పాల్పడిన ఓ యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేయడంతోపాటు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం. వర్ధన్నపేట మండలం చెన్నారంనకు చెందిన నాంపెల్లి రవి(30) ఈనెల 14న ఓ బాలికపై లైం గిక దాడికి పాల్పడ్డాడు. బాలిక సంగెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో గురువారం రవిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చి రిమాండ్ తరలించినట్లు పోలీసులు వివరించారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

పోలీస్‌స్టేషన్‌లో తల్లీకూతుళ్ల ఫిర్యాదు



తమపై దాడి చేసిన వారిని శిక్షించాలని కోరుతున్న బాధితులు

నర్సంపేట టౌన్, ఫిబ్రవరి 29 : ఇంటిపై దాడి చేసి, తమను ఇష్టానుసారంగా కొట్టి గాయపరిచిన వారిపై చర్యలు తీసుకోవాలని నర్సంపేట పోలీస్‌స్టేషన్‌లో తల్లీకూతుళ్లు గురువారం ఫిర్యాదు చేశారు. బాధితుల కథనం ప్రకారం.. పట్టణంలోని డిగ్రీ కళాశాల సమీపంలో గండికోట పద్మ, ఆమె పెద్ద కూతురు గుర్రం లక్ష్మి నివాసముంటున్నారు. వీరి ఇంటి పక్కనున్న ఖాళీ స్థలం విషయంలో గత కొద్ది రోజులుగా జరుగుతున్న గొడవలను ఆసరా చేసుకొని పాత కక్ష్యలను మనస్సులో పెట్టుకొని, ఇదే ప్రాంతానికి చెందిన ఓర్సు తిరుపతి, వెంకన్న, ఇద్దయ్య, రాజు, పరమేశ్వర్, సమ్మక్క, అనిత, స్వప్నలు గురువారం ఉదయం పద్మ ఇంటిపై దాడి చేసి తల్లి,కూతురిని గాయపరిచారు. గమనించిన స్థానికులు 100 కు డయ ల్ చేయగా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. గమనించిన దాడికి వచ్చిన వారంతా వెళ్లిపోయారని బాధితులు తెలిపారు. తమపై దాడి చేసిన వారిని చట్టరీత్యా శిక్షించాలని, ఓర్సు తిరుపతి, ఆయన కుటుంబ సభ్యులతో తమకు ప్రాణహాని ఉందని, తమకు రక్షణ కల్పించాలని తల్లి, కూతురు పోలీసులను వేడుకున్నారు. ఇదే విషయంపై నర్సంపేట ఏసీపీకి ఫిర్యాదు చేసినట్లు పద్మ, లక్ష్మిలు తెలిపారు.

రేపు ఉర్సు హవేలీలో ఆధ్యాత్మిక సదస్సు



ఆధ్యాత్మిక సదస్సు గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న మత పెద్దలు

కరీమాబాద్, ఫిబ్రవరి 29: పవిత్ర రంజాన్ నెల ప్రారంభాన్ని పురస్కరించుకొని ఉర్సు జాగీర్ హవేలీ గడిలో మార్చి 2న ఆధ్యాత్మిక సదస్సును నిర్వహిస్తున్నట్లు ఉర్సు హవేలీ పీఠాధిపతి సయ్యద్ యహియా పాషా ఖాద్రీ తెలిపారు. గురువారం ఉర్సు జాగీర్ హవేలీలో పలువురు మత పెద్దలతో విలేకరుల సమావేశంలో గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసం ప్రారంభం సందర్భంగా 2న రాత్రి 9 గంటలకు ఆధ్యాత్మిక సందస్సు (జల్సా)ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఆధ్యాత్మిక సదస్సుకు ప్రముఖ మత గురువులు, పీఠాధిపతులు హాజరవుతున్నట్లు తెలిపారు. ఖాజీపేట దర్గా పీఠాధిపతులు సయ్యద్‌షా ఖుస్రుపాషా, ఉర్సు దర్గా పీఠాధిపతులు సయ్యద్‌షా హైదర్ హిలాలోద్దిన్ ఖాద్రీ, నవీద్‌బాబా, ఉబేద్‌బాబా, విశిష్ట అతిథులుగా హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ మతగురువు మహమ్మద్ అహ్మద్ నక్షాబందీ జునైద్ సాహబ్ ఖిబ్లా తదితరులు పాల్గొంటున్నట్లు తెలిపారు. సమావేశంలో మైనారిటీ నాయకులు ఆయూబ్, మసూద్, సయ్యద్ ఖాజా హబీబుద్దీన్, అబూతుర్త షా ఖాద్రీ పాల్గొన్నారు.

నేడు వరంగల్‌లో బీజేపీ విజయసంకల్ప యాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న రాజు

వరంగల్ సిటీ, ఫిబ్రవరి 29: నేడు వరంగల్ తూర్పు, పశ్చిమ, వర్ధన్నపేట నియోజవర్గాల్లో బీజేపీ సంకల్ప యాత్రను నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ శాసనసభ్యులు పైడి రాకేష్‌రెడ్డి పాల్గొనున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు మడికొండ నుంచి యాత్ర ప్రారంభం అవుతుందని, అక్కడ నుంచి రాంపూర్, తరాలపల్లి, వనమాల కనపర్తి, వెంకటాపురం, ఐనవోలు వరకు కొనసాగుతుందన్నారు. అనంతరం ఐనవోలు మల్లిఖార్జున స్వామి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం పున్నేలు, పంథిని, కట్ర్యాల, ఇల్లంద, వరంగల్‌లోని ఆర్టీవో జంక్షన్, శంభునిపేట సర్కిల్, నాగమయ్యగుడి, వాల్‌మార్ట్, ఇసుకఅడ్డాల జంక్షన్ మీదుగా హెడ్‌పోస్టాఫీస్ సెంటర్‌లో రాకేష్‌రెడ్డి మాట్లాడుతారన్నారు. అనంతరం పోచమ్మమైదాన్ సెంటర్ నుంచి భద్రకాళీ గుడిలో అమ్మవారి దర్శనంలో యాత్ర ముగుస్తుందని రవికుమార్ తెలిపారు.

యాత్రను సక్సెస్ చేయాలి'

ఖిలావరంగల్,: నేడు వరంగల్ నగరంలో జరిగే బీజేపీ విజయసంకల్ప యాత్రను విజయవంతం చేయాలని ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాదాసి రాజు కోరారు. గురువారం తూర్పుకోటలో బీజేపీ ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోవు పార్లమెంట్ ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ అభ్యర్థుల గెలుపునకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు కృషి చేయాల న్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు ముత్తినేని శ్రీనివాస్, ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు జిలుకర వీరస్వామి, నలిగంటి నర్సింగం, ఆంజనేయులు, భాస్కర్‌రావు పాల్గొన్నారు.

మాదిగలకు రిజర్వేషన్

ఇవ్వకుంటే బీజేపీని ఓడిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న పిడమర్తి రవి

నర్సంపేట టౌన్, ఫిబ్రవరి 29 : మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించకుంటే రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడిస్తామని మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్, మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిడమర్తి రవి అన్నారు. మాదిగల జోడో యాత్రలో భాగంగా గురువారం పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సబ్బండ వర్గాలకు అవసరంలేని ఎన్నో బిల్లులను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బీజేపీ, అట్టడుగు వర్గాలకు అవసరమైన ఏ ఒక్క చట్టాన్ని పార్లమెంట్‌లో ప్రవేశపెట్టలేదన్నారు. తెలంగాణలో అన్ని ప్రధాన పార్టీలు మాదిగలకు మూడు పార్లమెంట్ స్థానాలను కేటాయించాలని, నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు తాళ్ల సునీల్, యాదగిరి, స్వామి, అజయ్ పాల్గొన్నారు.

చిన్ననాటి నుంచే మానవతా విలువలు అలవర్చుకోవాలి

వర్ధన్నపేట, ఫిబ్రవరి 29 : చిన్న నాటి నుంచే మానవత విలువలు అలవర్చుకోవాలని సామాజిక సేవా కార్యకర్త బంకా మాణిక్యారావు విద్యార్థులకు సూచించారు. గురువారం వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని టీఎంఆర్ఎస్ బాలుర హైస్కూల్, జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ రాజు అధ్యక్షతన మానవతా విలువలు- లక్ష్యం- విద్యా నైపుణ్యాలు, వివిధ సామాజిక అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా బంకా మాణిక్యారావు మాట్లాడుతూ సామాజిక సేవ చేయడం చాలా గొప్ప విషయమని అన్నారు. ఒక లక్ష్యాన్ని చేరాలంటే ప్రణాళిక రూపొందించుకొని అందుకనుగుణంగా సాధన చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేశ్, హరిరామ్, వికాస్, ప్రసాద్, చంద్రశేఖర్, వరప్రసాద్, అస్లాం, అబ్దుల్ రహీం, స్వాతి, శారద, మల్లికాంబ, విద్యార్థులు పాల్గొన్నారు.

సదరం శిబిరం విజయవంతం

• 138 మంది దివ్యాంగులకు నిర్ధారణ పరీక్షలు

వర్ధన్నపేట, ఫిబ్రవరి 29 : సదరం శిబిరానికి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 160 మంది దివ్యాంగులు దరఖాస్తు చేసుకున్నప్పటికీ 138 మంది దివ్యాంగులకు నిర్ధారణ పరీక్షలను గురువారం నిర్వహించినట్లు ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ నరసింహస్వామి తెలిపారు. అర్హులైన దివ్యాంగులందరికి జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ కార్యాలయం నుంచి సదరం సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు డీఆర్‌డీఏ సెక్షన్ విభాగం అధికారులు పేర్కొన్నారు. సదరం శిబిరంలో డాక్టర్ చందునాయక్, ఫిజియోథెరపిస్టు నర్సింహారెడ్డి, వేణు, డాక్టర్ సారంగపాణి, ఈఎన్‌టీ ఆడియోలజిస్టు అంజయ్య, హాస్పిటల్ సిబ్బంది, డీఆర్‌డీఏ సదరం విభాగం అధికారులు కుమార్, సైలజాకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పని చేసే విధానంతోనే ఉద్యోగులకు గుర్తింపు


ఉద్యోగ విరమణ పొందుతున్న రాధారాణి దంపతులను సన్మానిస్తున్న శ్రీపాల్‌రెడ్డి

దుగ్గొండి, ఫిబ్రవరి 29 : ఉద్యోగులకు పనిచేసే విధానంతోనే ప్రజల్లో గుర్తింపు లభిస్తుందని పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని మల్లంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న గుత్తికొండ రాధారాణి ఉద్యోగ విరమణపొందుతున్న సందర్భంగా ఉపాధ్యాయులు, గ్రామస్థులు చేసిన సన్మాన సభలో ముఖ్య అతిథిగా శ్రీపాల్‌రెడ్డి మాట్లాడారు. ప్రతీ ఉద్యోగికి ఉద్యోగ విరమణ ఉంటుందని, రాధారాణి ఉపాధ్యాయురాలిగా 35ఏళ్లపాటు పనిచేసి విద్యార్థులకు విద్యబోధన చేయడంలో సఫలకృతులయ్యారన్నారు. ఉపాధ్యాయుల అన్ని సమస్యలు త్వరలో ప్రభుత్వం తీర్చే విధంగా కృషి చేయడం జరుగుతుందన్నారు. ఈ సన్మాన సభలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఈదునూరి రవీందర్‌రెడ్డి, హెచ్ఎం భద్రమ్మ, మండల పీఆర్‌టీయూ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు రావుల దేవేందర్, కృపాకర్, శ్రీనివాస్, పీఈటీ వీరగోని స్వప్న, మహేంద్రనాథ్, కిషన్, నాగరాణి, వేణుగోపాల్ సుధాకర్ పాల్గొన్నారు.

పంట కాలువల్లో పూడికతీత పనులు ప్రారంభం

చెన్నారావుపేట, ఫిబ్రవరి 29 : మండలంలోని కోపాకుల చెరువు పంట కాలువలకు పూడిక తీత పనులను మాజీ సర్పంచ్ కుండె మల్లయ్య, మాజీ జడ్పీటీసీ జూన్నుతూల రాంరెడ్డిలు గురువారం ప్రారంభించారు. లోడి సాంఘిక స్వచ్ఛంద సేవా సంస్థ వారి ఆధ్వర్యంలో పూడిక తీత పనులను చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని 20 గ్రామాల్లో చెరువు కట్టలకు ఇరువైపులా జంగల్ కటింగ్ చేస్తారన్నారు. పంట కాలువలు శుభ్రం చేసి రానున్న వర్షాకాలంలో చివరి ఆయకట్టుకు సాగు నీరందిస్తారన్నారు. రైతులు పంటల సాగుకు లోడి స్వచ్ఛంద సంస్థ వారు చేస్తున్నపనులు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కోఆర్డినేటర్లు బాసాని అర్జరెడ్డి, కోట నగేష్, మండల కోఆర్డినేటర్ జనగాం రమేష్, బొంత సారయ్య, కుసుమ సురేష్, సురేందర్, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఎడ్లబండిని ఢీకొన్న డీసీఎం... రైతుకు గాయాలు


డీసీఎం ఢీకొని చెల్లాచెదురుగా పడిన ఎడ్లబండి (ఇన్‌సెట్‌లో) గాయపడ్డ వీరన్న

వర్ధన్నపేట రూరల్, ఫిబ్రవరి 29 : వేగంగా వస్తున్న డీసీఎం అదుపు తప్పి ఎడ్లబండిని ఢీకొట్టడంతో ఓ రైతుకు తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని కట్ర్యాల గ్రామశివారులో గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... కట్ర్యాలకు చెందిన రైతు చెవ్వల బీరయ్య ఉప్పరపెల్లి క్రాస్ రోడ్డు వద్ద ఉన్న తన వ్యవసాయ క్షేత్రానికి ఎడ్లబండిపై వెళ్తున్నాడు. వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై తొర్రూరు నుంచి వరంగల్ వైపు వెళ్తున్న డీసీఎం వెనక నుంచి వేగంగా వచ్చి ఢీకొట్టడంతో రైతు బీరయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వెంటనే స్థానికులు హన్మకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఎడ్లబండి సైతం ఎగిరి రోడ్డు పక్కన పడిపోగా, రెండు కాడెడ్లకు సైతం గాయాలయ్యాయి.

గోస పట్టేదెవరికి?

• డబుల్ డ్యూటీల పేరుతో మునిసిపల్ కార్మికులపై ఒత్తిళ్లు

నర్సంపేట టౌన్, ఫిబ్రవరి 29 : పల్లె అయినా.. పట్టణమైనా కార్మికులు పనిచేస్తేనే అవి పరిశుభ్రంగా ఉంటాయి. ప్రతీ రోజు సూర్యుని కంటే ముందే నిద్ర లేచి వీధుల్లోకి చేరే కార్మికుల గోసను పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. పనులు చెప్పడమే తప్ప.. తమ బాధలు వినేవాడే లేడని బరువెక్కిన గుండెలతో కుటుంబ పోషణ కోసం అన్నీ భరిస్తూ జీవితాలను నెట్టుకొస్తున్న దయనీయ స్థితి నర్సంపేట మునిసిపాలిటీలోని కార్మికులది. వివరాలిలా వున్నాయి. జిల్లాలోనే ప్రధాన పట్టణమైన నర్సంపేట మునిసిపాలిటీ కార్యాలయంలో 153 మంది కార్మికులు 24 వార్డుల్లో పారిశుధ్యం, పీడబ్ల్యూఎస్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. ఇందులో స్కిల్డ్, అన్ స్కిల్డ్‌గా విభజించకుండా అందరిని ఒక్కటే కేటగిరి కిందకు తీసుకొచ్చి కార్మికులను శ్రమ దోపిడీకి గురిచేస్తున్నారు. ఉదయం 5 గంటలకు ఒక్క నిమిషము ఆలస్యమైన వారిని ఇంటికి పంపిస్తూ కొంత మంది అధికారులు వారిని ఒత్తిళ్లకు గురి చేస్తున్నారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్మికుల సమస్యలపై గళం విప్పాల్సిన కొంత మంది నాయకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం అధికారులకు తొత్తులుగా మారారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డబుల్ డ్యూటీలు చేయాలని, నల్లా, నీటి పన్నులు వసూలు చేయాలని బిల్ కలెక్టర్లు చేసే విధులను అప్పగిస్తూ టార్గెట్లు పెడుతున్నారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారాంతపు సెలవు ఆదివారం రోజు సైతం పనిచేయాలని దౌర్జన్యం చేస్తూ తమ హక్కులను కాలరాస్తున్నారని వాపోతున్నారు. ప్రతీ సంవత్సరం వార్డుల వారీ డ్యూటీలను మార్పులు చేయాల్సి ఉండగా గత నాలుగు సంవత్సరాల నుంచి విస్మరిస్తున్నారు.

కార్మికులకివ్వని యూనిఫాం, పాదరక్షలు

గత కొన్ని సంవత్సరాలుగా కార్మికులకు ప్రతీ ఏటా రెండు జతల యూనిఫాం దుస్తులు, సబ్బులు, కొబ్బరి నూనె, రెండు జతల పాదరక్షలు, గ్లౌజ్‌లు ఇవ్వకుండా వీటికి సంబంధించిన డబ్బులను మింగేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఎంతో ఆశగా ఎదురుచూస్తున్న కార్మికులకు గత నెలల యూనిఫాం దుస్తులు కార్యాలయానికి వచ్చినప్పటికీ ఇవ్వడం లేదని కార్మికులు ఆరోపిస్తున్నారు.

అధికారుల ఇష్టారాజ్యం..

గత ఆరు నెలలుగా మునిసిపల్ చైర్మన్ సీటు కోసం కౌన్సిలర్లు, సీటును కాపాడుకోవడానికి చైర్మన్ పాట్లు పడుతూ ప్రజలు, కార్మికుల సమస్యలను గాలికొదిలేశారు. దీంతో అధికారులు ఆడిందే ఆట, పాడిందే పాట అన్న చందంగా తయారైంది. పారిశుధ్య కార్మికులను అధికారులకు వంట చేయడానికి, ఇతర పనులను వినియోగిస్తుండడం, కార్యాలయంలో పనిచేయడానికి, హరితహారం పనులను కాంట్రాక్టర్ ద్వారా పనులు చేయించకుండా పారిశుధ్య కార్మికులకు అప్పగించడంతో పట్టణంలో పారిశుధ్య పనులు కుంటుపడి కాలనీలు కంపుకొడుతున్నాయి. ఇప్పటికైనా కార్మికుల సమస్యలను పరిష్కరించి పట్టణాన్ని స్వచ్ఛ నర్సంపేటగా తీర్చిదిద్దాలని అధికారులను, ప్రజాప్రతినిధులను ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.


పారిశుధ్య పనుల్లో కార్మికులు

లారీ ఢీకొని వృద్ధురాలి మృతి


ఆండాలమ్మ (ఫైల్)

రాయపర్తి, ఫిబ్రవరి 29 : అతి వేగంగా వస్తున్న లారీ రోడ్డు దాటుతున్న వృద్ధురాలిని ఢీకొట్టడంతో ఆ వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. రాయపర్తి ఎస్ఐ సందీప్‌కుమార్ కథనం ప్రకారం... రాయపర్తికి చెందిన చింతనూరి ఆండాలమ్మ (70) వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిని దాటుతుండగా వరంగల్ నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న లారీ వేగంగా, అజాగ్రత్తగా వచ్చి ఢీకొట్టడంతో ఆండాలమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆండాలమ్మ మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు.

ప్రమాదవశాత్తు పశువుల కొట్టం దగ్ధం

దుగ్గొండి, ఫిబ్రవరి 29 : మండలంలోని తొగర్రాయిలో బుధవారం అర్ధరాత్రి మేకల రాజుకు చెందిన పశువుల కొట్టం ప్రమాదవశాత్తు నిప్పంటుకోగా స్థానికుల సమాచారంతో పోలీసులు మంటలు ఆర్పివేశారు. ఎస్సై పరమేశ్ కథనం ప్రకారం.. పశువుల కొట్టం నిప్పంటుకొని మంటలు లేచేయి. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మంటలు ఆర్పివేసే ప్రయత్నంచేశారు. మంటలు చల్లారకపోవడంతో అగ్నిమాపక కేంద్రానికి పోలీసులు సమాచారం అందించగా, అగ్నిమాపక కేంద్రం వారు మంటలు ఆర్పివేశారు.

రోడ్డు పనులు ప్రారంభం

చెన్నారావుపేట, ఫిబ్రవరి 29: మండలంలోని లింగాపురం గ్రామంలోని కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయానికి వెళ్లే రోడ్డు పనులను గురువారం కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్, మాజీ సర్పంచ్ తప్పెట రమేష్ ప్రారంభించి, మాట్లాడారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చొరవ, ప్రత్యేక నిధులతో రోడ్డు పనులను ప్రారంభించామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గ్రామాల్లో అభివృద్ధి పనులు సాధ్యమవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు మంచిక కుమారస్వామి, మాదాటి కుమారసామి, పురం రాంబాబు, ఎల్లయ్య, కుమారస్వామి, ఇందూరి రాజు, లక్ష్మీనారాయణ, దూడెలు, మూగల రాజు, శ్రీను, శంకరయ్య పాల్గొన్నారు.

పొదుపుతోనే కుటుంబం అభివృద్ధి

దుగ్గొండి, ఫిబ్రవరి 29 : డబ్బు పొదుపుతోనే కుటుంబాలు అభివృద్ధి చెందడంతో పాటు భవిష్యత్ సంక్షేమానికి బాటలు పడతాయని తిమ్మంపేట చైతన్య పురుషుల పొదుపు సంఘం అధ్యక్షుడు అనుమాండ్ల ఈశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని తిమ్మంపేటలో గురువారం పొదుపు సంఘం 25 వార్షిక మహాసభ నిర్వహించగా అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి మాట్లాడారు.

పొదుపు సంఘం అధ్యక్షుడిగా ఈశ్వర్‌రెడ్డి



మండలంలోని తిమ్మంపేట పురుషుల పొదుపు సంఘానికి 20వ సారి అధ్యక్షుడిగా అనుమాండ్ల ఈశ్వర్‌రెడ్డి ఎంపికయ్యారు. చైతన్య పురుషుల పొదుపు సంఘం 25వ వార్షిక మహాసభ గురువారం పొదుపు సంఘాల సమితి అధ్యక్షుడు నిరంజన్, ఎన్నికల అధికారి తోకల రత్నాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించగా కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఉపాధ్యక్షుడిగా కందకట్ల మదన్‌మోహన్, డైరెక్టర్లు గా ఈదుల గణపతి, మామునూరి విఘ్నేశ్వర్, సౌడారపు కొంరెల్లి, కూచన రాజేందర్, కొరె చంద్రమోహన్, ఈదుల నవీన్, నల్లగొండ రమేశ్, శ్రీముల ప్రశాంత్, నల్లగొండ కోటీ, షేక్ షరీఫ్, గణకుడిగా దండు కర్ణాకర్ ఎంపికైనట్లు ఎన్నికల అధికారి రత్నాకర్‌రెడ్డి ప్రకటించారు.

పౌరులు హక్కులను తెలుసుకోవాలి

వర్ధన్నపేట రూరల్, ఫిబ్రవరి 29 : భారత రాజ్యాంగం కల్పించిన పౌర హక్కులను ప్రతీ ఒక్కరు తెలుసుకోవాలని డీటీ వినయేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని నల్లబెల్లిలో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం ప్రజలకు ఇచ్చిన ప్రతీ హక్కును తెలుసుకుని స్వేచ్ఛగా జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మార్గం భిక్షపతి, ఎంపీటీసీ జ్యోతి, బిర్రు మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలు అభివృద్ధి చెందాలి

వర్ధన్నపేట రూరల్, ఫిబ్రవరి 29 : గ్రామాలు అన్ని రకాలుగా అభివృద్ధి చెందాలని వర్ధన్నపేట ఎంపీడీవో వెంకటరమణ అన్నారు. గురువారం మండలంలోని కడారిగూడెం గ్రామాన్ని సందర్శించారు. మాజీ సర్పంచ్ మంద సతీష్ ఆమెను శాలువాతో సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. తాగునీటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని, తడిపొడి చెత్తను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు.

రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీదే విజయం


మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ ధర్మారావు

నర్సంపేట టౌన్, ఫిబ్రవరి 29 : రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో దేశంలోనే కాకుండా తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అత్యధిక స్థానాల్లో విజయం సాధించి మళ్లీ మోదీ ప్రధాని కావడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ ఎం. ధర్మారావు అన్నారు. నర్సంపేట పట్టణంలోని సిటిజన్స్ క్లబ్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల సమీపిస్తున్నందున మోదీ పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, వారి మద్దతు తీసుకునేందుకు రథయాత్రలను దేశ వ్యాప్తంగా చేపడుతున్నామన్నారు. అందులో భాగంగానే విజయ సంకల్ప యాత్ర కొనసాగుతున్నదన్నారు. మోదీ పాలనలోనే పేదరిక నిర్మూలన కోసం జన్‌ధన్ ఖాతాలను సామాన్యులకు చేరువ చేసిందన్నారు. ముద్ర రుణాలతో వీధి వ్యాపారులకు రుణాలందించామన్నారు. కాంగ్రెస్ హయాంలో అవినీతి, అక్రమాలే జరిగాయని, అందుకే దేశ ప్రజలు మోదీకి జేజేలు పలుకుతున్నారన్నారు. సిర్పూర్ కాగజ్‌నగర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ మాట్లాడుతూ రాష్ట్ర సీఎం మైండ్ గేమ్ ఆడుతున్నాడని, ప్రజలు, బీజేపీ కార్యకర్తలు అర్థం చేసుకోవాలన్నారు. బీఆర్ఎస్, బీజేపీ పొత్తు అనే అసత్య ప్రచారం చేసి ఎంపీ ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు ప్రయత్నిస్తున్నాడని, ప్రజలు విజ్ఞులని ఆయన మాటలను ఎవ్వరూ నమ్మరన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ మధ్యే పోటీయని అన్నారు. ఈ సమావేశంలో మాజీ రాజ్యసభ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు, జిల్లా పార్టీ అధ్యక్షుడు గంట రవికుమార్, ఎడ్ల అశోక్‌రెడ్డి, చాడ శ్రీనివాస్‌రెడ్డి, కుంభంపాటి పుల్లారావు, రేసు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

• బీజేపీకి ఓటువేసి మోదీ నాయకత్వాన్ని బలపర్చాలి

నల్లబెల్లి: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి మోదీ నాయకత్వాన్ని బలపర్చాలని సిర్పూర్ కాగజ్‌నగర్ ఎమ్మెల్యే హరీష్ ప్రజలకు పిలుపు నిచ్చారు. బీజేపీ నిర్వహిస్తున్న విజయ సంకల్ప యాత్ర గురువారం నల్లబెల్లికి చేరుకుంది. ఎమ్మెల్యే మాట్లాడుతూ 370 ఆర్టికల్‌ను రద్దుచేసి కశ్మీర్‌ను భారత్‌లో అంతర్భాగం చేసిన ఘనత నరేంద్రమోదీదేనన్నారు. జాతీయ రహదారులు, వీధిలైట్లు, ఐదు కిలోల బియ్యం, ఉపాధి హామీ పథకం పనులు, సిమెంట్ రోడ్లను కేంద్ర ప్రభుత్వ నిధులతోనే చేశారన్నారు. మాజీ ఎమ్మెల్యే ధర్మారావు మాట్లాడుతూ హిందువుల రామ మందిర నిర్మాణం 500 ఏళ్ల నాటి కల మోదీ నాయకత్వంలో సాకరమైందన్నారు. కేంద్రంలో మూడోసారి బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, ఎడ్ల అశోక్‌రెడ్డి, తడుక అశోక్‌గౌడ్, రేసు శ్రీనివాస్, నర్సింహరాములు తదితరులు పాల్గొన్నారు.


యాత్రలో ప్రసంగిస్తున్న సిర్పూర్ కాగజ్‌నగర్ ఎమ్మెల్యే హరీష్

బ్యాంకింగ్ వ్యవహారాలపై అవగాహన పెంచుకోవాలి

వరంగల్ (నర్సంపేట), ఫిబ్రవరి 29 : బ్యాంకింగ్ వ్యవహారాలపై అవగాహన పెంచుకోవాలని కెనరా బ్యాంక్ ఆఫీసర్ శివాజీ ఎన్ఎస్ఎస్ వలంటీర్లయిన విద్యార్థులకు సూచించారు. పట్టణంలోని సిద్దార్థ డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు బ్యాంకింగ్ వ్యవహారాలపై అవగాహన కల్పించడానికి కళాశాల ప్రిన్సిపాల్ గోగుల ప్రభాకర్‌రెడ్డి గురువారం కెనరా బ్యాంక్‌ను వలంటీర్లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంక్ బ్రాంచి నిర్వాహణ తీరు, బ్యాంక్ ప్రొడక్ట్స్, బ్యాంకింగ్ ఓచర్లను విద్యార్థులకు వివరించారు. రుణసదుపాయాలు, బీమా పథకాలు, ఆన్ లైన్ లావాదేవీలను ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు ఫీల్డ్ ఆఫీసర్ నివేదిత అవగాహన కల్పించారు. వరంగల్ లీడ్ బ్యాంక్ ఫైనాన్షియల్ లిటరసీ కో-ఆర్డినేటర్ భాస్కరాచారి వలంటీర్లకు ఆర్థిక అక్షరాస్యత, భద్రత, ఆన్‌లైన్ మోసాలను వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో అశోక్, అధ్యాపకులు అనిల్, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పూర్తి చేయాలి

నెక్కొండ, ఫిబ్రవరి 29 : నెక్కొండ మండలంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి పనులకు గాను రూ.85 కోట్ల నిధులను మంజూరు చేసిందని, వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే పూర్తి చేయాలని ఎంపీపీ జాటోతు రమేశ్, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సంగని సూరయ్య, పట్టణ అధ్యక్షుడు కొనిజేటి భిక్షపతి డిమాండ్‌చేశారు. గురువారం నెక్కొండలోని ప్రభుత్వ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మండలంలోని ప్రజా సమస్యలను గుర్తించి నిధులను మంజూరు చేయించారన్నారు. చిన్నకొర్పోలు-పెద్దకొర్పోలు మధ్య ఉన్న వట్టివాగుపై చెక్‌డ్యాం, బ్రిడ్జి నిర్మాణంకు, నాగారం-చిన్నకొర్పోలు మధ్య బ్రిడ్జి నిర్మాణంకు, అలంకానిపేట గ్రామం నుంచి చిన్నకొర్పోలు గ్రామం వరకూ నూతన బిటి రోడ్డు నిర్మాణం పనులకు శంకుస్థాపనలను చేశారన్నారు. మండలంలో పలు గ్రామాల్లో మహిళ సమైఖ్య భవనాలకు నిధులను మంజూరు చేయించారంటూ, ఇందుకు సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన జీవోలను చూపించారు. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులను పూర్తిచేసి ప్రజా సమస్యలను పరిష్కరించాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రదాన కార్యదర్శి తాటిపల్లి శివ, దొనికన సారంగపాణి, రవి, హరికిషన్, వాగ్యానాయక్ పాల్గొన్నారు.

వేరుశనగ పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

వర్ధన్నపేట రూరల్, ఫిబ్రవరి 29 : రైతులు వేరుశనగ పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జాతీయ ఆహార భద్రత మిషన్ కన్సల్టెంట్ పి.సారంగం సూచించారు. గురువారం మండలంలోని చెన్నారంలో రైతులు మంద నర్సయ్య, రాజు, అశోక్‌లకు చెందిన వేరుశనగ పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించి మాట్లాడారు. జాతీయ ఆహార భద్రత మిషన్ నూనె గింజల అభివృద్ధి పథకంలో భాగంగా సరఫరా చేసిన వేరుశనగ పంటను పరిశీలించినట్లు తెలిపారు. ప్రస్తుతం కాయ అభివృద్ధి దశలో ఉందని, అవసరం ఉన్న చోట మల్టికే 10 గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో శరత్, సిబ్బంది రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాదిగలకు 12శాతం రిజర్వేషన్ ఇవ్వాలి

లేదంటే బీజేపీని ఓడిస్తాం: రవి


సమావేశంలో మాట్లాడుతున్న పిడమర్తి రవి

నర్సంపేట టౌన్, ఫిబ్రవరి 29 : మాదిగలకు 12శాతం రిజర్వేషన్ ఇవ్వకుంటే రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడిస్తామని మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్, మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిడమర్తి రవి అన్నారు. మాదిగల జోడో యాత్రలో భాగంగా గురువారం పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సబ్బండ వర్గాలకు అవసరంలేని ఎన్నోబిల్లులను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బీజేపీ, అట్టడుగు వర్గాలకు అవసరమైన ఏ ఒక్క చట్టాన్ని పార్లమెంట్‌లో ప్రవేశపెట్ట లేదన్నారు. బీజేపీ కేవలం కార్పొరేట్ సంస్థలు, అగ్రకులస్తుల కోసమే పనిచేస్తుందని, బీజేపీని రాష్ట్రం నుంచి తరిమేయాలన్నారు. తెలంగాణలో అన్ని ప్రధాన పార్టీలు మాదిగలకు మూడు పార్లమెంట్ స్థానాలను కేటాయించాలని, నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు తాళ్ల సునీల్, యాదగిరి, స్వామి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

పోలీస్‌స్టేషన్‌లో తల్లీకూతుళ్ల ఫిర్యాదు


బాధితులు పద్మ, లక్ష్మి

నర్సంపేట టౌన్, ఫిబ్రవరి 29: తమ ఇంటిపై దాడిచేసి, తమను ఇష్టాను సారంగా కొట్టి గాయపర్చిన వారిపై చర్యలు తీసుకోవాలని నర్సంపేట పోలీస్‌స్టేషన్‌లో తల్లీకూతుళ్లు గురువారం ఫిర్యాదు చేశారు. బాధితుల కథనం ప్రకారం... పట్టణంలోని డిగ్రీ కళాశాల సమీపంలో గండికోట పద్మ, ఆమె పెద్ద కూతురు గుర్రం లక్ష్మి కుటుంబం నివాసం ఉంటున్నది. వీరి ఇంటి పక్కను ఖాళీ స్థలవిషయంలో గత కొద్ది రోజులుగా జరుగుతున్న గొడవలను ఆసరా చేసుకొని పాత కక్షలను మనస్సులో పెట్టుకొని, ఇదే ప్రాంతానికి చెందిన ఓర్సు తిరుపతి, ఓర్సు వెంకన్న,ఓర్సు ఇద్దయ్య, ఓర్సు రాజు, ఓర్సు పరమేశ్వర్, ఓ. సమ్మక్క, ఓ. అనిత, ఓ. స్వప్నలు గురువారం ఉదయం పద్మ ఇంటిపై దాడిచేసి పద్మ, లక్ష్మిలను గాయపరిచారు. ఇదే సమయంలో స్థానికులు 100కు డయల్ చేయగా పోలీసులు సంఘటన స్థలానికి రావడంతో దాడికి వచ్చిన వారంతా వెళ్లిపోయారని బాధితులు తెలిపారు. తమపై దాడి చేసిన వారిని చట్టరీత్యా శిక్షించాలని, ఓర్సు తిరుపతి, ఆయన కుటుంబ సభ్యులతో తమకు ప్రాణహాని ఉందని, తమకు రక్షణ కల్పించాలని పోలీసులను వేడుకున్నారు. ఇదే విషయంపై నర్సంపేట ఏసీపీకి ఫిర్యాదు చేసినట్లు పద్మ, లక్ష్మిలు తెలిపారు.

చలో మేడిగడ్డను విజయవంతం చేయాలి

వర్ధన్నపేట, ఫిబ్రవరి 29 : మేడిగడ్డపై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కుట్రలను ఎండగట్టి, ప్రజలకు కాళేశ్వరం ద్వారా అందుతున్న ఫలాలను వివరించేందుకు మార్చి 1వ తేదిన చలో మేడిగడ్డ సందర్శనకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు వస్తున్న ట్లు వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. మేడిగడ్డలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు, పార్టీ నాయకులకు స్వాగతం పలికేందుకు వర్ధన్నపేట నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపు నిచ్చారు. వంగపహాడ్ క్రాస్‌రోడ్ నేషనల్ హై వే మీదకు సకాలంలో హాజరు కావాలని కోరారు.

ఉన్నత లక్ష్యం దిశగా చదువులను కొనసాగించాలి

చెన్నారావుపేట, ఫిబ్రవరి 29 : విద్యార్థులు ఉన్నత లక్ష్యం దిశగా చదువులను కొనసాగించాలని సిద్దార్థ విద్యా సంస్థల చైర్మన్ కంది గోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి సిద్దార్థ గురుకుల హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచి మంచి లక్షణాలను అలవర్చుకోవాలన్నారు. విద్యార్థులు చదువును నిర్లక్ష్యం వహించరాదన్నారు. నాయకత్వ లక్షణాలను అలవర్చుకొని, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో అండెం కర్ణాకర్‌రెడ్డి, మేడి రమేష్‌గౌడ్, జక్కుల జగదీశ్వర్ ఫైనాల రాజు. వల్లా వేణు, దామెర గణేష్, కోటేశ్వర్, బాలరాజు. విజయ్, కిషన్, కృష్ణమోహన్, ఆరే రాజు, పొన్నం రమేష్, కల్యాణ్, అర్జయ్య, రోజా, కవిత, దివ్యజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వర్ధన్నపేట, ఫిబ్రవరి 29 : వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ సర్కిల్‌లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ ఆధ్వర్యంలో గురువారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం కాంగ్రెస్ పార్టీ నాయకులు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలను అధికారంలోకి వచ్చిన 90 రోజుల్లోనే అమలు చేస్తామని ప్రకటించి ఆరు గ్యారంటీలలో రెండు గ్యారంటీలను తక్షణమే అమలుచేసి,మిగతా నాలుగు గ్యారంటీలలో గృహజ్యోతి, రూ.500లకే గ్యాస్ సిలిండర్ అమలు చేసినందుకు హర్షం వ్యక్తంచేస్తూ సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేయడం జరిగిందన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మొత్తానికి మొత్తం సీట్లు కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడం ఖాయమని, పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు మహ్మద్ అప్సర్, బండౌతపురం మాజీ సర్పంచ్ మరుపట్ల సాయికుమార్ పాల్గొన్నారు.

బాలికను రేప్ చేసిన యువకుడి అరెస్టు

వరంగల్(సంగెం), ఫిబ్రవరి 29 : మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై లైంగిక దాడికి పాల్పడిన ఓ యువకుడిపై పోలీసులు కేసునమోదు చేయడంతోపాటు అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం... వర్ధన్నపేట మండలం చెన్నారంనకు చెందిన నాంపెల్లి రవి(30) ఈనెల 14న ఓ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక సంగెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో గురువారం రవిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చి రిమాండ్ తరలించినట్లు పోలీసులు వివరించారు.